ప్రజాశక్తి

మంగళవారం 3 అక్టోబర్ 2023 | 8 పేజీలు





ఎన్‌టిఆర్ | కృష్ణా



గాంధీ చిత్రపటానికి ఖద్దరు మాల వేసి నివాళులర్పిస్తున్న కృష్ణేశ్వరరావు తదితరులు

గాంధీ పేరుతో రాజ్యమేలుతున్న గాడ్సే వారసులు

అభ్యుదయ సినీ నటుడు, మాటల రచయిత కృష్ణేశ్వరరావు

ప్రజాశక్తి - విజయవాడ : గాంధీజీని హత్య చేసిన గాడ్సే వారసులు నేడు కేంద్రంలో రాజ్యమేలుతున్నారని అభ్యుదయ సినీ నటులు, మాటల రచయిత వైఎస్ కృష్ణేశ్వరరావు అన్నారు. కానీ అదే గాంధీ ఫొటోలు పెట్టుకుని వారు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. జాతిపిత మహాత్మా గాంధీ 154 వ జయంతి సందర్భంగా "77 ఏళ్ల స్వాతంత్ర్యంలో గాంధీజీ కన్న కలలు నెరవేరాయా...' అన్న అంశంపై ఎంబి విజ్ఞాన కేంద్రం, సర్వోదయ ట్రస్ట్, గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, మానవత స్వచ్ఛంద సంస్థ, ఇండియన్ సివిలైజేషన్ గాంధీ ట్రస్టు సంయుక్త ఆధ్వర్యాన సోమవారం నగరంలోని ఎంబి విజ్ఞాన కేంద్రంలో సదస్సు నిర్వహించారు. ఎస్‌పి రామరాజు అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో కృష్ణేశ్వరరావు మాట్లాడుతూ దేశ సమైక్యత, సమగ్రత, లౌకికతత్వం కోసం గాంధీ చివరి వరకు పోరాడారని అన్నారు. అయితే నేడు దేశంలో ఆర్‌ఎస్‌ఎస్, హిందుత్వశక్తుల వారసులు పాలన చేస్తూ దేశ విచ్ఛిన్నానికి మతోన్మాదాన్ని ఒక ఆయుధంగా ఉపయోగిస్తున్నారని విమర్శించారు. గాంధీజీ ఎంతో నిరాడంబరంగా ఉండేవారని, అలాగే ప్రజల కోసం పోరాడుతున్న కమ్యూనిస్టులు కూడా అలాగే ఉంటారని అన్నారు. రాముడు కంటే రామబాణం మాదిరిగా గాంధీజీ కంటే గాంధీ మార్గం గొప్పదని అన్నారు. దేశంలో, రాష్ట్రంలో గాంధీజీ ఆశించిన గ్రామ స్వరాజ్యం నేడు లేదన్నారు. ఆధునిక (మిగతా 6లో)

వైసిపిలో భగ్గుమన్న విబేధాలు

బిల్లుల విషయంలో బాహాబాహీకి దిగిన ప్రజాప్రతినిధులు వార్త 8లో

మునేటిలో మునిగి విఆర్ఒ మృతి

ప్రజాశక్తి- గంపలగూడెం, కంచికచర్ల



గంపలగూడెం మండలం పెనుగొలను గ్రామ విఆర్ఒ షేక్ ఇమ్రాన్ (28) మునేటిలో ఈతకు దిగి ప్రమాదవశాత్తూ మరణించారు. ఓ శుభ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఆదివారం ఇమ్రాన్ తన కుటుంబ సభ్యులతో స్వగ్రామమైన కంచికచర్ల మండలం పెండ్యాల వెళ్లారు. ఈ నేపథ్యంలో సెలవు దినం కావడంతో సోమవారం 11 గంటల సమయంలో సరదాగా మునేటిలో ఈతకు దిగారు. కొద్దిసేపటికి నీటి గుండంలోకి జారుకుని ప్రమాదవశాత్తూ గల్లంతయ్యారు. స్థానికుల సమాచారంతో జాలర్లు అతని కోసం గాలించారు. ఊబిలో ఉన్న ఇమ్రాన్ మతదేహాన్ని బయటకు తీశారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నందిగామ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఆయన మృతదేహాన్ని పెండ్యాలకు తరలించారు. ఇమ్రాన్ కుటుంబం గంపలగూడెం మండలం ఊటుకూరులో మూడు దశాబ్దాలు నివాసం ఉంటోంది. ఆయనకు రెండేళ్ల క్రితం వివాహమైంది. ఆయనకు భార్య, తల్లిదండ్రులు ఉన్నారు. ఇమ్రాన్ మతి పట్ల గంపలగూడెం తహాశీల్దారు, విఆర్ఒలు, తహాశీల్దారు కార్యాలయ సిబ్బంది ప్రగాఢ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులకు సానుభూతి వ్యక్తం చేశారు. కంచికచర్ల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఖరీఫ్‌కు నీటి ఎద్దడి

- సీజన్ ప్రారంభం నుండీ వెన్నాడుతున్న సమస్య
- ఎన్‌టిఆర్ జిల్లా వ్యాప్తంగా వర్షా భావం
- 8 మండలాల్లో తక్కువ వర్షపాతం నమోదు
- 3.04లక్షల ఎకరాల్లో పంటలు సాగు



ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

2023 ఖరీఫ్ సీజన్‌కు సాగు నీరు ప్రధాన సమస్యగా మారింది. సీజన్ ప్రారంభం నుంచీ ఈ సమస్య వెంటాడుతోంది. తగిన మోతాదులో వర్షాలు పడకపోవడం వల్ల ఎన్టీఆర్ జిల్లావ్యాప్తంగా సాగు నీటి ఎద్దడి పరిస్థితులు నెలకొన్నాయి. దాదాపు ఎనిమిది మండలాల్లో వర్షాభావం తీవ్రంగా ఉంది. జిల్లాలో మొత్తం 20 మండలాలకుగాను 12 మండలాల్లో సాధారణ వర్షపాతం కంటే కాస్తా తక్కువగాను, 8 మండలాల్లో బాగా తక్కువగానూ వర్షపాతం నమోదైంది. ప్రత్యేకించి ఖరీఫ్ సీజన్లో జూన్ నుంచి సెప్టెంబరు వరకు జిల్లాలో 18.0 మిమీ తక్కువగానే వర్షపాతం నమోదైంది. ఖరీఫ్‌కు జిల్లావ్యాప్తంగా 711 మిమీ వరకు సాధారణ వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా, కేవలం 583 మిమీ మాత్రమే నమోదైంది. నందిగామ, వీరులపాడు, గంపలగూడెం, తిరువూరు, రెడ్డిగూడెం, జి కొండూరు, చందర్లపాడు, ఇబ్రహీంపట్నం మండలాల్లో వర్షాలు సాధారణం కంటే చాలా తక్కువగా కురిశాయి. దీంతో ఈ మండలాల్లో సాగునీటి ఎద్దటి నెలకొంది. నందిగామలో జూన్ నుంచి ఇప్పటి వరకు 674.4 మిమీ వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, కేవలం 528.3 మిమీ మాత్రమే నమోదైంది. ఇక్కడ దాదాపు 21.7 మిమీ తక్కువగా వర్షాలు పడ్డాయి. అదేవిధంగా జి కొండూరు మండలంలో సాధారణం కంటే 50.5 శాతం తక్కువ వర్షపాతం నమోదైంది. వీరులపాడులో సాధారణ కంటే 24.6 మీమి తక్కువగాను, గంపలగూడెంలో 23.9, తిరువూరులో 24.2, రెడ్డిగూడెంలో 28.8, చందర్లపాడులో 24.5, ఇబ్రహీంపట్నంలో 39,2 మిమీ చొప్పున తక్కువ వర్షపాతం నమోదైంది. మరోవైపు ఖరీఫ్ పంటలు నీటిఎద్దడి నుంచి ఎలా బయటపడుతాయోనని జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు ఆందోళనలు చెందుతున్నారు. ప్రతి ఏటా దసరా రోజు వానలు పడుతున్నాయని, ఈ దసరాకు కూడా వర్షాలు పడితే గండం గడుస్తుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే సాగు నీరు ఎలా అందించాలనే దానిపై ఇరిగేషన్ శాఖ అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ముందుగానే నాగార్జున సాగర్ జలాశయంలో నీటి మట్టం తక్కువుగా ఉండటం, దీనికితోడు వర్షా భావం నెలకొనడంతో ఇరిగేషన్ అధికారులకు ఖరీఫ్ సాగుకు నీటిని అందించడం కత్తిమీద సాములా మారింది. ఈ నేపథ్యంలో వరి పంటకు చివరి వరకు నీటిని అందంచడం కష్టమేననే అభిప్రాయాన్ని పలువురు వ్యక్తం చేస్తున్నారు.

స్వాతంత్ర్య సమరంలో

బందరుకు ప్రత్యేక స్థానం

మౌన దీక్షలో పవన్ కళ్యాణ్

ప్రజాశక్తి - కృష్ణాప్రతినిధి



స్వాతంత్ర్య ఉద్యమంలో మచిలీపట్నంనకు ప్రత్యేకమైన స్థానం ఉందని, ఎన్నో ఉద్యమాలు ఈ గడ్డపై పురుడుపోసుకున్నాయని జనసేన అధినేత పవన్ కళ్యాణ్ అన్నారు. మహాత్మా గాంధీ 154వ జయంతి సందర్భంగా మచిలీపట్నంలో ఆయన రెండు గంటల సేపు మౌన దీక్ష చేపట్టారు. వారాహి నాలుగో విడత యాత్రలో భాగంగా కృష్ణాజిల్లాలో పర్యటిస్తున్న ఆయన ముందుగా నగరంలోని సువర్ణ కళ్యాణ మండపంలో నిర్వహించిన గాంధీ జయంతి వేడుకల్లో పాల్గొన్నారు. ఈసందర్భంగా మహాత్మాగాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పవన్ కళ్యాణ్, పార్టీ రాజకీయ వ్యవహారాల చైర్మన్ నాదెండ్ల మనోహర్ పూలమాలుల వేసి నివాళు లర్పించారు. జనసేన పార్టీ జిల్లా కార్యవర్గంతో కలిసి వేదికపై ఆశీనులై జాతి నేతలను స్మరించుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ బందరులోని ఆంధ్ర జాతీయ కళాశాల చాలా ప్రత్యేక పరిస్థితుల్లో ఏర్పాటు చేశారని, స్వాతంత్య ఉద్యమంలో భాగంగా మహాత్ముడు ఈ కళాశాలను సందర్శించారని గుర్తు చేశారు. సర్వేపల్లి రాధాకృష్ణ, పింగళ వెంకయ్య, అడవి బాపిరాజు, కవిసామ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ, నోరి దత్తాత్రేయ వంటి ఎందరో మేధావులను సమాజానికి అందించిన చరిత్ర ఈ కళాశాలకు ఉందన్నారు. గొప్ప చరిత్ర ఉన్న ఈ కళాశాల శిథిలావస్థకు చేరడం బాధాకరమన్నారను. పాలకులు మొక్కుబడిగా గాంధీ జయంతి జరపకుండా శిథిలావస్థకు చేరుకున్న కళాశాల అభివృద్ధికి కృషి చేయాలన్నారు. మహాత్ముడు నడియాడిన ఆంధ్ర జాతీయ కళాశాలను త్వరలోనే సందర్శిస్తానన్నారు. అనంతరం పవన్ కళ్యాణ్ మౌన దీక్ష చేపట్టారు. ఈ దీక్షా సమయంలో ఆయన పుస్తక పఠనం చేస్తూ కూర్చున్నారు. ఆదివారం రాత్రి జనసేన మచిలీపట్నం నియోజకవర్గ ఇన్చార్జి బండి రామకృష్ణ ఇంట్లో బస చేసిన ఆయన నగరంలోని ఇంగ్లీషుపాలెం, రేవతిథియేటర్, బస్టాండ్, జిల్లా కోర్టు, లక్ష్మీ టాకీస్ సెంటర్ల మీదుగా ఓపెన్‌టాప్ కారులో సోమవారం ఉదయం 11 గంటలకు పరాసుపేటలోని సువర్ణ కళ్యాణ మండపానికి చేరుకున్నారు. ఆయనను చూసేందుకు అభిమానులు పెద్ద సంఖ్యలో రోడ్లకు ఇరువైపులా బారులుతీరారు. మండపంలోకి వెళుతున్న సమయంలో పవన్‌కళ్యాణ్ అభిమానులకు అభివాదం చేశారు. పవన్ రాక సందర్భంటా టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు, (మిగతా 6లో)

ప్రజాసంఘాల ఆధ్వర్యంలో గాంధీ జయంతి


22వ డివిజన్‌లో ...

ప్రజాశక్తి - విజయవాడ : భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) కృష్ణలంక 22వ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో జాతిపిత మహాత్మాగాంధీ జయంతి సోమవారం ఘనంగా జరిగింది. ముందుగా డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి జి రామన్న, జిల్లా అధ్యక్షులు పి కృష్ణ గాంధీజి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...దేశ ఐక్యత, సమగ్రతల కోసం మతోన్మాదం, విభజన రాజకీయాలపై ఈ నాటి యువత పోరాడటమే గాంధీజికి అర్పించే నిజమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ తూర్పు నగర కమిటీ అధ్యక్షులు బత్తుల ఉమామహేశ్వరరావు, నాయకులు కె శ్రీనివాస్, అంజి, త్రిసూల్, పౌరసంక్షేమ సంఘం నాయకులు బత్తుల చిన్నారావు, లక్ష్మణ, శ్రీను తదితరులు పాల్గొన్నారు. **తిరువూరు :** సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఇరువురి చిత్రపటాలకు పూలమాలలేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రజా సంఘాల నాయకులు గాంధీ, శాస్త్రీల జీవిత విశే షాలను వివరించారు. ఈకార్యక్రమంలో విజ్ఞాన కేంద్రం కన్వీనర్ కడిమి పాపారావు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు. **విజయవాడ అర్బన్ :** పటమట ఈ సేవ కేంద్రం వద్ద మహాత్మాగాంధీ 154వ జయంతి పురస్కరించుకొని 12, 13, 14 డివిజన్, సిపిఎం కష్ణాజిల్లా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. పార్టీ సీనియర్ నాయకులు ఎస్‌కె.మస్తాన్ మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు విజయవాడ తూర్పు సిటీ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు వి.బి.రాజు ఈ సమావేశానికి అధ్యక్షత వహించారు అనంతరం సిపిఎం నగర నాయకులు వి.గురుమూర్తి మాట్లాడుతూ 7న ప్రజాగర్జనభేరి బహిరంగ సభను కార్మికులంతా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా 12 ,13, 14 డివిజన్ శాఖల కార్యదర్శి డి.రవీంద్ర స్వాగతం పలికారు. విజయవాడ తూర్పు సిటీ బిల్డింగ్ కార్యదర్శి బి.బెనర్జీ వందన సమర్పణ చేశారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కోశాధికారి వై.ఏడుకొండలు, పార్టీ సీనియర్ నాయకులు వై.ఎల్లారావు, కార్మిక నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



తిరువూరులో...



విజయవాడ పటమటలో...

గాంధీ మార్గం అనుసరణీయం


విజయవాడ సిపి కార్యాలయంలో...


కంచికచర్లలో...

ప్రజాశక్తి - విజయవాడ : జాతిపిత మహాత్మా గాంధీ, మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలు నగర పోలీస్ కమీషనర్ వారి కార్యాలయంలో సోమవారం ఘనంగా జరిగాయి. ముందుగా నగర పోలీస్ కమీషనర్ కాంతి రాణా టాటా, డిసిపి విశాల్‌గున్ని మహాత్మా గాంధీ , లాల్ బహదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సి.పి మాట్లాడుతూ...గాంధీజి, లాల్‌బహుదూర్‌శాస్త్రి వంటి వారి ఆలోచనలు, సంస్కరణలు మన అందరికీ ఆదర్శప్రాయమని కొనియాడారు. **వన్‌టౌన్ :** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దేవస్థానం ఆధ్వర్యంలో మహామండపం 6వ అంతస్తులో 154వ గాంధీ జయంతి కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబు, కార్యనిర్వాహనాధికారి దర్బముల్ల భ్రమరాంబ పాల్గొని మహాత్మ గాంధీ చిత్రపటానికి పూలమాలలు సమర్పించి, నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహక ఇంజినీర్లు కెవిఎస్ కోటేశ్వరరావు, లింగం రమాదేవి, వైదిక సిబ్బంది, సహాయ కార్యనిర్వాహణాధికారులు పర్యవేక్షకులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు. భారత జాతిపిత మహాత్మాగాంధీ జీవితం ప్రపంచానికి ఆదర్శప్రాయమని గాంధీ దీక్షల వ్యవస్థాపకులు, మహాత్మాగాంధీ దేవాలయం వ్యవస్థాపకులు, ఇండియన్ సివిలైజేషన్ గాంధీ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు రాంపిళ్ళ జయప్రకాష్ కొనియాడారు. సోమవారం పాలఫ్యాక్టరీ వద్ద ఉన్న సయ్యద్ అప్పలస్వామి కళాశాల ప్రాంగణంలోని మహాత్మాగాంధీ దేవాలయంలో ఇండియన్ సివిలైజేషన్ గాంధీ ట్రస్ట్ డైరెక్టర్‌లు తమ్మిన సోనియా, తమ్మిన హనుమ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు గాంధీ దీక్షల విరమణ కార్యక్రమం జరిగింది. గాంధీ జయంతి సందర్భంగా మహాత్ముని విగ్రహానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా గాంధీ దీక్షను స్వీకరించిన పలువురు విద్యార్థిని విద్యార్థులు రాంపిళ్ళ జయప్రకాష్ సమక్షంలో ఉప్పులూరి లక్ష్మీనారాయణ చేతుల మీదుగా గాంధీ దీక్షల విరమణ చేశారు. ఈ సందర్భంగా గాంధీ అష్టపంచ దశోత్తర పంచశతి నామావళి మినీ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విశ్వ మానవాళి శ్రేయస్సును కోరుతూ గాంధీ హోమం నిర్వహించారు.. ఈ కార్యక్రమంలో సయ్యద్ అప్పలస్వామి జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అజ్మీరా రాంపండు నాయక్, ఆంధ్ర ఆర్ట్స్ అకాడమీ సెక్రటరీ గోళ్ళ నారాయణరావు, నగర ప్రముఖులు ముక్కామల పెద్దబాబు, కోడూరి రామ్మోహనరావు, పలువురు కళాశాల విద్యార్థిని విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు. **నందిగామ :** నందిగామ పట్టణ జనసేన పార్టీ అధ్యక్షుడు తాటి శివ కృష్ణ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో భారత జాతిపిత మహాత్మా గాంధీజీ, భారత స్వాతంత్ర్య సమర యోధుడు, భారత మాజీ ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి జన్మదిన జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. జనసేన పార్టీ నియోజకర్గ నాయకులు కామిసెట్టి వెంకటేశ్వర రావు, పూజారి రాజేష్, వీర మహిళా విభాగం నాయకురాలు మేకపోతుల లక్ష్మి యాదవ్, పాముల పాటి వెంకట తులసి, వీరులపాడు మండల అధ్యక్షులు బేతపూడి జయరాజు, ఉపాధ్యక్షులు సింగంసెట్టి శ్రీనివాస్, కొమ్మవరపు నరసింహ స్వామీ,వెంకట్, ఆదిలక్ష్మి, వెంకట నరసమ్మ, చిరంజీవి, శివకోటి పలువురు ఘన నివాళి అర్పించారు. నందిగామ పట్టణంలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జాతిపిత మహాత్మా గాంధీ 155వ జయంతి వేడుకలను, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ముందుగా వారి చిత్రపటాలకు శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్ మోహన్‌రావు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం గాంధీ సెంటర్‌లో ధ్యానముద్రలో ఉన్న బాపూజీ విగ్రహానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. నందిగామ పట్టణం లోని రైతు పేట తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో సోమవారం జాతిపిత మహాత్మా గాంధీ, భారత మాజీ ప్రధాని లాల్ బహుదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు తెదేపా శ్రేణులతో కలిసి మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పూలమాలలు వేసి నివాళు లు అర్పించారు. నందిగామ పట్టణంలోని గాంధీ సెంటర్ పరిశీలనకు విచ్చేసి జాతిపిత మహాత్మా గాంధీజీ కి శాసనమండలి సభ్యులు మొండితోక అరుణ్ కుమార్ నివాళు లర్పించారు. **మైలవరం :** మైలవరంలో నూజివీడు రోడ్డులోని గాంధీ విగ్రహానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. **రెడ్డిగూడెం :** రెడ్డిగూడెం మండల పరిషత్ కార్యాలయంలో గాంధీజీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా వారికి ఘన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారి సేవలను కొనియాడారు. **విజయవాడ:**ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో గాంధీ జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి కష్ణాజిల్లా గ్రంధాలయ సంస్థ చైర్ పర్సన్ తిప్పరమల్లి జమల పూర్ణమ్మ, ముఖ్య అతిథిగా విచ్చేసి, గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళుల అర్పించారు. అనంతరం విద్యార్థులు గాంధీజీ గురించి చదివి వినిపించారు. దేశ భక్తి గీతాలు ఆలపించారు, దేశభక్తి గేయాలకు నత్యాలు చేశారు. అనంతరం చిత్ర లేఖనం, వ్యాస రచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి కె.రమాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు. రామ్మోహన్ గ్రంథాలయంలో నిర్వహించిన గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి ఉత్సవాల్లో గ్రంథాలయ అధ్యక్షులు చింతలపూడి కోటేశ్వరరావు, ఉపాధ్యక్షులు, దమ్మాల రామచంద్ర రావు, కార్యదర్శి శ్రీ వేములపల్లి కేశవరావు, గ్రంథాలయ కమిటీ సభ్యులు, గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. చిత్త రంజన్ గ్రేడ్-2 శాఖ గ్రంథాలయంలో చిన్నారులకు 'మహాత్మా గాంధీజీ సూక్తులు" అను అంశంపై "వక్తత్వ" పోటీ నిర్వహించారు. చిత్ర లేఖనం, దేశ భక్తి గీతాలు, తదితర పోటీలలో విజేతలకు ప్రోత్సాహక బహుమతులు గ్రంథాలయ అధికారి పి.సంపత్ కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో చిన్నారులు, గ్రంథాలయ సిబ్బంది, గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు. **కంచికచర్ల :** జాతి పిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలు సోమవారం కంచికచర్ల మండలంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో గాంధీజీ చిత్ర పటానికి గ్రామ సర్పంచ్ వేల్పుల సునీత, పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా గ్రామంలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం లో భాగంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామ సభ నిర్వహించారు. .**గంపలగూడెం:** స్థానిక మండల కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం ఘనంగా గాంధీ జయంతి వేడుకలు నిర్వహించినట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఎడ్లపల్లి రామకష్ణ తెలిపారు.మొదటగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అమ్మిరెడ్డిగూడెం మాజీ సర్పంచ్ తమ్మారపు ఆదినారాయణ, వేల్పుల పాపమ్మ, మరీదు నవనీతం, మోదుగు లక్ష్మణరావు తదితరులు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.ఇది ఇలా ఉంటే స్థానిక మండల పరిషత్ నందు ఎంపీడీవో వైపి రెడ్డి, తోపాటు పలు ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాల్లో గాంధీ జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. **జగ్గయ్యపేట :** మున్సిపల్ కార్యాలయం నందు మహాత్మా గాంధీ మరియు లాల్ బహుదూర్ శాస్త్రి జయంతుల సందర్భంగా వారి విగ్రహాలకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ సభ్యులు సామినేని ఉదయభాను పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు.


గంపలగూడెంలో కాంగ్రెస్ కార్యాలయంలో...


వన్‌టౌన్ దుర్గగుడిలో...


జగ్గయ్యపేటలో...


విజయవాడలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో


రామ్మోహన్ గ్రంథాలయంలో...


చిత్తరంజన్ గ్రేడ్-2 శాఖ గ్రంథాలయంలో


పెనుగంచిప్రోలులో...



గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

ప్రభుత్వ తీరుపై సమగ్ర శిక్షా ఉద్యోగుల వినతి

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా)

సమగ్ర శిక్ష , కెజిబివిలో పనిచేస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పార్ట్ టైం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సోమవారం స్థానిక భాస్కర పురంలోని గాంధీజీ విగ్రహానికి సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల జేఏసీ వైస్ చైర్మన్ సిహెచ్ఎన్ దేవేంద్ర రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొన్ని శాఖలో ఉద్యోగులను మాత్రమే రెగ్యులర్ చేసి మినిమం ఆఫ్ టైం స్కేల్ అమలు చేసి వేతనాలు పెంచారని కానీ ఆరు సంవత్సరాలు నుండి సమగ్ర శిక్షా లో పనిచేస్తున్న ఉద్యోగులకు మాత్రం వేతనాలు పెంచలేదన్నారు. నెలలు తరబడి వేతనాలు పెండింగ్ ఉన్నాయని, ఎం టి ఎస్ కోసం ఇచ్చిన జీఓ లు కూడా అమలు చేయలేదన్నారు. రవాణా చార్జీలు, పని భారంతో ఉద్యోగులు అల్లాడుతున్నరన్నారు. ఈ నేపథ్యంలో గత నెల రోజుల నుండి వివిధ రూపాల్లో నిరసన కార్యక్రమాలు చేస్తున్నప్పటికీ ప్రభుత్వం నుండి స్పందన లేదన్నారు. సమగ్ర శిక్షా, కెజిబివిలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు అంకాని శేషుబాబు, జిల్లా అధ్యక్షురాలు గడిదేసి వనజ,పాము రాజేష్,లేళ్ల అశోక్, లంకపల్లి సుజాత, సిఆర్పి విభాగం నుండి పడమటి నాగరాజు, రామకృష్ణ, యూనస్, సాయిలక్ష్మి, అంజలి, నందకిషోర్, కంప్యూటర్ ఆపరేటర్ నుండి లేళ్ల రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

టిడిపి నిరసన దీక్షలు

ప్రజాశక్తి-వన్‌టౌన్: చంద్రబాబు నాయుడు అరెస్టుకు నిరసిస్తూ గాంధీ జయంతి రోజున 42వ డివిజన్‌లో డివిజన్ అధ్యక్షురాలు యేదుపాటి వెంకటరమణి యేదుపాటి రామయ్య ఆధ్వర్యంలో శివాలయం సెంటర్ నుంచి స్వాతి రోడ్డు వరకు ర్యాలీ నిర్వహించి అనంతరం శివాలయం సెంటర్లో గాంధీ మహాత్ముని విగ్రహా వరకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు.





ప్రజాశక్తి-విజయవాడ: టిడిపి అధినేత చంద్రబాబు చేపట్టిన సత్యమేవ జయతే దీక్షకు మద్దతుగా సోమవారం కేశినేని శివనాథ్(చిన్ని) కార్యాలయంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు నిరాహార దీక్ష కార్యక్రమం జరిగింది. ముందుగా గాంధీజి జయంతి సందర్భంగా ఆయన మాజీ మేయర్ జంధ్యాల శంకర్, మాజీ ఎమ్మెల్యే జలీల్ ఖాన్, అమరావతి పరిరక్షణ సమితి కన్వీనర్ కొలికపూడి శ్రీనివాసరావు గాంధీజి చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సయ్యద్ రఫీ, మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఫతావుల్లా, కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి పాల్గొన్నారు. **వీరులపాడు :** మండలంలో పెద్దాపురం గ్రామంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో చంద్రబాబు నాయుడు రాజమండ్రి సెంట్రల్ జైల్లో గాంధీ జయంతి సందర్భంగా నిరాహారదీక్ష చేపట్టం చంద్రబాబు టిడిపి నాయకులు దాములూరు మధుసూదన్ రిలే నిరాహార దీక్ష కార్యక్రమం చేపట్టారు. **విజయవాడ అర్బన్:** తూర్పు నియోకజవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ఆధ్వర్యంలో అశోక్‌నగర్ కార్యాలయం దగ్గర సత్యమేయ జయతే పేరుతో నిరసన దీక్ష చేపట్టారు. **జగ్గయ్యపేట :** సత్యమేవ జయతే దీక్షకు సంఘీభావంగా టిడిపి జాతీయ కోశాధికారి శ్రీరాం రాజగోపాల్ దీక్షలో పాల్గొన్నారు. **నందిగామ :** సత్యమేవ జయతే దీక్షను రైతుపేట టిడిపి కార్యాలయంలో ప్రారంభించారు. **మైలవరం :** మైలవరంలో మోర్సుమల్లి గ్రామ పార్టీ అధ్యక్షులు శ్రీనివాసరావు, వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. **పెనుగంచిప్రోలు :** మండల అధ్యక్షుడు చింతల సీతారామయ్య ఆధ్వర్యంలో స్థానిక తూర్పు బజార్‌లోని గాంధీ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. **కంచికచర్ల :** జనసేన, టిడిపి ఆధ్వర్యంలో పరిటాల గ్రామంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.



గుడివాడ: స్థానిక టిడిపి కార్యాలయం వద్ద రావి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో దీక్ష చేపట్టారు. సీనియర్ నాయకులు కంచర్ల సుధాకర్ దీక్షను ప్రారంభించారు. స్థానిక బైపాస్ రోడ్‌లోని వెనిగండ్ల ఫౌండేషన్ కార్యాలయంలో పిన్నమనేని బాబ్జి నిరాహార దీక్ష ప్రారంభించారు. **పమిడిముక్కల:** హనుమంతపురం గ్రామంలో టిడిపి నాయకులు నిరసన, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వరల కుమార్ రాజా, తాడిశెట్టి నరేష్, రాజులపాటి శ్రీనివాసరావు పాల్గొన్నారు. **ఉయ్యూరు:** సంచార రిలే నిరాహార దీక్ష వాహనంతో పెనమలూరు నియోజకవర్గంలోని మూడు మండలాల్లో తిరుగుతూ చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టును ప్రజలకు వివరిస్తున్నారు. కంకిపాడు మాజీ ఎంపీపీ దేవినేని రాజా, మాజీ జడ్పిటిసి సభ్యులు గ్రంధి శివరామకృష్ణ నాయకత్వం వహించి గ్రామాలలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. **తోట్లవల్లూరు:** మండలంలోని దేవరపల్లి గ్రామంలో టిడిపి అధ్యక్షుడు వీరపనేని శివరాం ప్రసాద్ అధ్యక్షతన జల దీక్ష కార్యక్రమం చేపట్టారు. **ఘంటసాల:** మండంలోని పాపవినాశనం గ్రామంలో సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. దీక్షకు జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు మండలి వెంకట్రామ్, జనసేన పార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. రాష్ట్ర తెలుగు యువత నాయకులు తాడికొండ వెంకటేశ్వరరావు (చిన్నా) నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. **అవనిగడ్డ:** అవనిగడ్డలో మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ ఆయన సతీమణి విజయలక్ష్మితో కలిసి దీక్షలో పాల్గొన్నారు. అలాగే జిల్లా పార్టీ అధ్యక్షులు కొనకళ్ళ నారాయణరావు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొనకల్ల జగన్నాధ రావు(బుల్లయ్య), మండలి వెంకట్రామ్ దీక్షలో కూర్చున్నారు.



తోట్లవల్లూరులో...

పవన్‌ను ప్రజలు విశ్వసించడంలేదు : సింహాద్రి

ప్రజాశక్తి-అవనిగడ్డ: జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌ను జనం విశ్వసించకపోవడం వల్లే అవనిగడ్డ సభకు ప్రజలు రాలేదని ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు విమర్శించారు. సోమవారం వైసిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ టిడిపితో పొత్తు కారణంగానే పవన్ కళ్యాణ్ అవనిగడ్డ సభకు జనం రాలేదన్నారు. వైసీపీ ప్రభుత్వంలో జగన్మోహన్ రెడ్డి అందిస్తున్న సుపరిపాలన పట్ల ప్రజలు విశ్వాసంతో ఉన్నారన్నారు. ఈ సమావేశంలో కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు, తుంగల సుమతి దేవి, చింతలపూడి లక్ష్మీనారాయణ, దాసరి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళా కండక్టర్ మృతి

ప్రజాశక్తి-భవానీపురం: రోడ్డు దాటుతున్న మహిళా కండక్టర్‌ను ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ఆమె మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు భవానీపురం అనిల్ క్యాస్టేర్, బ్లాక్-4లో కూంద్రపు చిన్నారావు కుటుంబం నివాసం ఉంటున్నారు. వీరికి కుమార్తె, కుమారుడు ఉన్నారు. చిన్నారావు గొల్లపూడి కాంప్లెక్స్‌లో ముఠా పనిచేస్తుంటాడు. భార్య నెమ్మాది లక్ష్మి (50) గవర్నర్‌పేట-1 డిపోలో కండక్టర్‌గా పనిచేస్తుంది. ఈనెల 1వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు లక్ష్మీ డ్యూటీకి వెళ్లింది. తిరిగి రాత్రి 10 గంటలకు విధులు ముగించుకుని గవర్నర్‌పేట డిపోలో లెక్కలు అప్పజెప్పి తిగిరి బస్సులో గొల్లపూడి సారాకొట్టు సెంటర్‌లో దిగి అక్కడ నుండి ఇంటికి వెళ్లేందుకు రోడ్డు జీబ్రా క్రాస్ చేస్తుండగా రాత్రి 11 గంటల సమయంలో హైదరాబాద్ నుండి వై జంక్షన్ వైపు వెళ్లు బుల్లెట్ కండక్టర్ లక్ష్మీని ఢీకొట్టాడు. దీంతో లక్ష్మి తలకు తీవ్ర గాయాలయ్యాయి. అంబులెన్సులో మణిపాల్ ఆసుపత్రిలో తరలించి చికిత్స అందిస్తుండగా అర్ధరాత్రి 12 గంటల సమయంలో లక్ష్మి మృతిచెందింది. భర్త చిన్నారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు విచారణ చేపట్టారు.

పంచాయతీలకు నిధులివ్వండి : వైవిబి



నిరసన తెలుపుతున్న సర్పంచ్‌లు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (కృష్ణా) రాస్త్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వాలని కోరుతూ ఎపి సర్పంచ్‌ల సంఘం, ఆంధ్ర ప్రదేశ్ పంచాయతీ రాజ్ ఛాంబర్ ఆధ్వర్యంలో సోమవారం మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా మచిలీపట్నంలోని మహాత్మాగాంధీ విగ్రహం వద్ద నల్ల వస్త్రాలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీరాజ్ ఛాంబర్ రాష్ట్ర అధ్యక్షులు బాబు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 12,918 గ్రామ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం 14 ,15 ఆర్థిక సంఘం ద్వారా పంపిన 8,660 కోట్ల రూపాయలు రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లించిందని, తిరిగి ఆ నిధులు సర్పంచుల ఖాతాల్లో జమ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామ సచివాలయాలను, వాలంటీర్లను గ్రామ పంచాయతీలు, సర్పంచుల ఆధీనంలోనే పని చేయించాలన్నారు. ఉపాధి హామీ నిధులను చట్ట ప్రకారం గ్రామపంచాయతీలకు ఇచ్చి సర్పంచ్ల చేతే ఖర్చు చేయించాలని డిమాండ్ చేశారు. గతంలో మాదిరే గ్రామ పంచాయతీలకు రాష్ట్ర ప్రభుత్వం ఉచిత విద్యుత్‌ను ఇవ్వాలన్నారు. అలాగే సర్పంచులకు, ఎంపీటీసీలకు రూ.15 వేలు, ఎంపీపీలకు, జడ్పిటిసిలకు రూ.30 వేలు గౌరవ వేతనం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణాజిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు గోలి వసంత కుమార్, సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గల్లా తిమోతి, సర్పంచుల సంఘం రాష్ట్ర కార్యదర్శి కాగిత గోపాలరావు, కాపా శ్రీనివాసరావు, మారుతి, బాషా, వంపు గడవల ఫ్రాన్సిస్, సుధాకర్ పాల్గొన్నారు.

గోడపత్రిక ఆవిష్కరణ

కంకిపాడు: తాడిగడప మున్సిపాలిటీ పోరంకి సిఐటియు కార్యాలయంలో నిరుద్యోగ సదస్సు గోడపత్రికను సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పెనమలూరు మండల సిపిఎం కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తులు మాట్లాడుతూ రాజమండ్రిలో ఈ నెల 4న ఉదయం పది గంటలకు జరగనున్న నిరుద్యోగ సదస్సుకు జయప్రదం చేయాలని కోరారు. యువతీ యువకులు పెద్దఎత్తున హాజరై నిరుద్యోగంపై చర్చించి భవిష్యత్ కార్యక్రమాన్ని రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో పాండమనేని శ్రీనివాసరావు, సిపిఎం పోరంకి కార్యదర్శి పుసులూరి పాతాళ లక్ష్మి, దాసరి సింహాచలం, కుంజి నరసయ్య, అయ్యప్ప పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న సిపిఎం నాయకులు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న బుద్ధప్రసాద్

విద్యార్థులకు పోటీలు

ప్రజాశక్తి-అవనిగడ్డ: నేటి తరం విద్యార్థులకు గాంధీజీ ఆశయాలను తెలియచేసేందుకే ప్రతిభ పాట పోటీలు నిర్వహిస్తున్నట్లు మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. గాంధీ జయంతిని పురస్కరించుకొని సోమవారం అవనిగడ్డ గాంధీ క్షేత్ర కమిటీ డివిసీమ లలిత కళా సమితి దివిసీమ బాలానంద సంఘంలో సంయుక్త ఆధ్వర్యంలో నియోజకవర్గస్థాయిలో విద్యార్థులకు ప్రతిభా పోటీలు నిర్వహించారు. వ్యాసరచన, వక్తత్వం, చిత్రలేఖనం, దేశభక్తి గేయాలాపాన నిర్వహించారు వివిధ పాఠశాలల నుండి 195 మంది విద్యార్థులు పాల్గొన్నారు. డాక్టర్ గుడిసే విష్ణు ప్రసాద్ లలిత కళా సమితి కార్యదర్శి కోనపురెడ్డి చంద్రశేఖరరావు, తుంగల పాండురంగారావు, కేవీ కామేశ్వరి, మండల వెంకట్రావు పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానాలతో సంక్షోభంలో గీత వృత్తి

కల్లుగీత కార్మిక సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు రామచంద్రరావు

ప్రజాశక్తి-మొవ్వ: రాష్ట్ర ప్రభుత్వ నిరాదరణకు గురౌతున్న కల్లుగీత వృత్తిని పరిరక్షించాలని కల్లుగీత కార్మిక సంఘం కృష్ణాజిల్లా గౌరవాధ్యక్షులు వాకా రామచంద్రరావు డిమాండ్ చేశారు. మొవ్వ మండలం నిడుమోలులో కల్లుగీత కార్మికులతో కలిసి మహాత్మాగాంధీ చిత్రపటానికి సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లక్షలాది మంది కార్మికులు గీతవృత్తిపై ఆధారపడి జీవిస్తుండగా ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వ విధానాల వలన గీత వృత్తి సంక్షభంలోనికి నెట్టివేయబడినదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమాదకరమైన గీత వృత్తి ప్రోత్సాహకానికి ఉమ్మడి ఆంధ్ర రాష్ట్రంలో కార్మికులు పోరాటాల ఫలితంగా 1991లో కల్లుగీత కార్పొరేషన్‌ను సాధించుకున్నారని గుర్తుచేశారు. ప్రస్తుత వైసిపి ప్రభుత్వం ఆ కార్పొరేషన్‌ను నిర్వీర్యం చేసి కార్మికులకు రక్షణ, సామాజిక భద్రత, సంక్షేమం లేకుండా చేసిందని విమర్శించారు. రాష్ట్రంలో కల్తీ మద్యం వరదల్లా ప్రవహిస్తుంటే గడగడపకి ఒకటి అన్నట్లు విచ్చలవిడిగా అక్రమ మద్యం అమ్మకాలు చేస్తున్న బెల్టుషాపుల జోరుకు గీత వృత్తిదారులు అమ్మకాలు లేక వృత్తి వదిలేసి వలసల బాట పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదుకోవలసిన ప్రభుత్వం గీతవృత్తిదారులను విస్మరించడంతోనే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. 1978లో పోరాటాల ఫలితంగా సాధించుకున్న ఎక్స్‌గ్రేషియా ప్రస్తుత ప్రభుత్వం కార్మికులకు అందించటంలేదని విమర్శించారు. పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేయకపోగా వృత్తిని లేకుండా చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతున్నట్లుగా వ్యవహరిస్తుందని ఆరోపించారు. కులాలవారీగా కార్పొరేషన్‌లు ఏర్పాటు చేసి గీత కార్మికుల పొట్టలు కొట్టారని విమర్శించారు. కుల కార్పొరేషన్‌లను తాకట్టుపెట్టి పెద్దమొత్తంలో అప్పులు చేసిన ప్రభుత్వం గీత కార్మికుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించడం సరైనదికాదన్నారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మికుల సంఘ నేతలు పామర్తి శ్రీను, మురాల అచ్చేశ్వరరావు, కొనకళ్ల రాంబాబు, కాగిత శ్రీనివాసరావు, రాజులపాటి మధు తదితరులు పాల్గొన్నారు.



గాంధీజీ చిత్రపటానికి వినతిపత్రం అందిస్తున్న నాయకులు

ఐసిడిఎస్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - పెనుగంచిప్రోలు: మండల పరిధిలోని ముండ్లపాడు 2 అంగన్వాడీ కేంద్రంలో సోమవారం ఐసిడిఎస్ ఆవిర్భావ దినోత్సవం కార్యక్రమాలను అంగన్వాడీ కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ, లక్ష్మి భార్గవి, సూపర్ వైజర్ ఉషారాణి నాగమణి ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ధనలక్ష్మి, చిన్నారులు, తల్లి తండ్రులు పాల్గొన్నారు.

బోస్ విగ్రహాన్ని ఏర్పాటుచేయాలి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : స్థానిక భవానీపురం శివాలయం సెంటర్లో సుభాష్ చంద్రబోస్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, అదేవిధంగా క్రాంబే రోడ్డుకు కుద్దూస్ రోడ్డుగా నామకరణ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జనసేన పార్టీ 42వ డివిజన్ అధ్యక్షురాలు తిరుపతి అనూష ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అనూష మాట్లాడుతూ భవానీపురంలో అర కిలోమీటర్ లోపు ఎన్ని రాజశేఖర్ రెడ్డి విగ్రహాలు ఏర్పాటు చేస్తారని ప్రశ్నించారు. ఇప్పటికి మూడు విగ్రహాలు ఏర్పాటు చేశారని విమర్శించారు. కాగా శివాలయం సెంటర్‌లో దళితుల ఆశాజ్యోతి బాబూ జగజీవన్‌రామ్ విగ్రహాన్ని ఏర్పాటుచేయాలని కోరుతూ దళిత సంఘాల ఆధ్వర్యంలో సోమవారం నిరసన వ్యక్తంచేశారు.

తెలంగాణాలో సమ్మెకు సంఘీభావం

ప్రజాశక్తి - వీరులపాడు : తెలంగాణ రాష్ట్రంలో ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణంలో అంగన్వాడీ వారి సమస్యల పరిష్కారానికి పోరాటంలో భాగంగా సమ్మెలో పాల్గొని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు నిరసన తెలియజేస్తున్న అంగన్వాడీలకు సిఐటియు వీరులపాడు సిఐటియు నాయకులు లాల్ అహ్మద్ గౌస్ సంఘీభావం తెలిపారు. రెండు రాష్ట్రాల్లో జరుగుతున్న అంగన్వాడీ పోరాటాలు విజయవంతం కావాలని ఎన్టీఆర్ జిల్లా కమిటీ తరపున వారి సమ్మె విజయవంతం కావాలని కోరారు.

ట్యూషన్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి - తిరువూరు : జనవిజ్ఞానవేదిక (జెవివి) అధ్వర్యంలో తిరువూరు శివారు పిటి.కొత్తూరులో ఏర్పాటు చేసిన ట్యూషన్ సెంటర్‌ను నగర పంచాయతీ వైస్‌చైర్‌పర్సన్ గుమ్మా వెంకటేశ్వరి సోమవారం రాత్రి ప్రారంభించారు. పేద పిల్లలు ఉన్నత వంతులుగా ఎదిగేందుకు స్కూల్‌తో పాటు ట్యూషన్ సెంటర్లు ఎంతో దోహదపడతాయని వెంకటేశ్వరి పేర్కొన్నారు. అందుకు జనవిజ్ఞానవేదిక ముందుకు వచ్చి ఉచితంగా ప్రయివేట్ సెంటర్‌ను ఈ ప్రాంతంలో నిర్వహించటం అభినందనీయమని అన్నారు. ఈ ఏరియా ప్రజలు ఎక్కువ మంది ఇతర ప్రాంతాల్లో ఇటుక తయారీ బట్టిలకు వెళ్లి అరు నెలల వరకు ఇళ్లకు రారని, వాళ్ల పిల్లలు చదువుకు ఆటంకం ఉంటుందని, జెవివి ట్యూషన్ సెంటర్‌తో అసమస్య తొలగిపోతుందని ఆమె చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు కడిమి పాపారావు, మేకల నాగేంద్ర బాబు, ఎస్.కుమారి తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల కుటుంబాలకు సాయం

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : మైలవరం నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్తల కుటుంబాలకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గన్నే వెంకటనారాయణ ప్రసాద్ (అన్నా) అండగా నిలిచారు. రెడ్డిగూడెం మండలం, కూనపరాజు పర్వ గ్రామంలో ఇటీవల మరణించిన తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు దేవుళ్ల రామకృష్ణ, దారం శ్రీను, గురజాల కోటి స్వామి, కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేసిన అన్నా వారికి ఆర్థికంగా ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున సహాయం చేశారు.

ఖైదీలు సత్ప్రవర్తనతో ఉండాలి

ప్రజాశక్తి- నందిగామ : ఖైదీలు సత్ప్రవర్తన కలిగి ఉండాలని నందిగామ సబ్ కోర్టు జడ్జి వి లక్ష్మీ రాజ్యం పేర్కొన్నారు. సోమవారం నందిగామ సబ్‌జైలులో ఖైదీలనుద్దేశించి ఉచిత న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా నందిగామ సబ్ కోర్టు జడ్జి వి.లక్ష్మీ రాజ్యం పాల్గొని ఖైదీల సమస్యలు తెలుసుకున్నారు. ఖైదీలకు మెను ప్రకారము బోజనం పెడుతున్నారా అని తెలుసుకున్నారు. ఖైదీలనుద్దేశించి జడ్జి వి.లక్ష్మీరాజ్యం మాట్లాడుతూ ఖైదీలు సత్యప్రవర్తన కలిగి మంచి జీవితం కొనసాగించాలని కోరారు. చట్టాలు గురించి అవగాహన పెంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బొందలపాటి రామకష్ణ, మట్టా ప్రసాద్, చిరుమామిళ్ళ శ్రీనివాసరావు, వెంకటేశ్వరరావు, నంద్రు శ్రీరామమూర్తి, జైలు సూపరింటెండెంట్ చదల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

6న చలో విజయవాడ

ప్రజాశక్తి - విజయవాడ : ఆటో, మోటార్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అక్టోబర్ 6న చలో విజయవాడ ధర్నాచౌక్‌లో జరిగే మహాధర్నాలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని సిఐటియు ఎన్‌టిఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.సిహెచ్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం రైల్వేస్టేషన్ పార్సిల్ ఆఫీస్ గేటు వద్ద జరిగిన ప్రచార భేరి కార్యక్రమంలో శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలో బి.జె.పి రాష్ట్రంలో వై.సి.పి ప్రభుత్వాలు ఆటో, మోటార్ కార్మికులపై కక్ష సాధింపు చర్యలకు దిగుతూ వారి జీవనోపాధిని దెబ్బతీస్తున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలిండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కోశాధికారి కె.దుర్గారావు, విజయవాడ సెంట్రల్ సిటీ ఆటో వర్కర్ యూనియన్ సి.ఐ.టి.యు ప్రధాన కార్యదర్శి ఎం.హనుమంత రావు, రైల్వే స్టేషన్ పార్సెల్ ఆఫీస్ గేట్ ఆటో స్టాండ్ యూనియన్ నాయకులు బి.లక్ష్మణ, జె.సూర్య నారాయణ, బి.వెంకటేశ్వరరావు, ఎం.కొండ, జి.తిరుమల పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎన్.సిహెచ్.శ్రీనివాస్

4న నిరుద్యోగ రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి - విజయవాడ, నందిగామ, తిరువూరు : నిరుద్యోగ రాష్ట్ర సదస్సు గోడపత్రికను సోమవారం సిపిఎం 33వ డివిజన్ కమిటీ ఆధ్వర్యంలో విడుదల చేశారు. ఈ సదస్సు 4న రాజమహేంద్రవరంలో నిర్వహించనున్నట్లు కమిటీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కమిటీ సభ్యులు టి.ప్రవీణ్ మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులను మోసంచేశాయని అన్నారు. ఖాళీగా ఉన్న లక్షల పోస్టులు భర్తీ చేయకుండా కాలయాపన చేయడం తగదని అన్నారు. ఈ సదస్సుకు నిరుద్యోగులంతా హాజరు కావాలని కోరారు. ఆంధ్రప్రదేశ్లో నూతన యూత్ పాలసీ ప్రకటించాలని, కేంద్ర ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న 9.64 లక్షలు, రాష్ట్ర ప్రభుత్వ శాఖలో ఖాళీగా ఉన్న 2. 35 లక్షల పోస్టులు భర్తీ చేయాలి. ఈ కార్యక్రమంలో పార్టీ డివిజన్ బాధ్యు లు ఎం.మురళి, మోహనాచారి,జతంగీ రాజాలు, ముతయ, తదితరులు పాల్గొన్నారు...తిరువూరులో సిపిఎం పట్టణ కార్యదర్శి మేకల నాగేంద్రప్రసాద్, నందిగామ పట్టణ కమిటీ కార్యదర్శి కటారపు గోపాల్ గోడపత్రిక ఆవిష్కరించారు.



33వ డివిజన్‌లో గోడపత్రికావిష్కరణ



తిరువూరులో గోడపత్రికావిష్కరణ



నందిగామలో...

సెలవు రోజుల్లో తరగతుల నిర్వహణ

ప్రజాశక్తి- కంచికచర్ల: సెలవు దినాల్లో తరగుతులు నిర్వహించే ప్రయివేట్ పాఠశాలు,కళాశాలు పై చర్యలు తీసుకొని వాటి గుర్తింపు రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ మండల ప్రధాన కార్యదర్శి ఎస్. కె జాహిదా డిమాండ్ చేశారు.గాంధీ జయంతి సందర్భంగా సోమవారం కంచికచర్ల మండల కేంద్రంలోని పలు ప్రయివేట్,కళాశాలు పాఠశాలల్లో తరగతులు నిర్వహిస్తున్నా సమాచారంతో ఎస్ఎఫ్ఐ నాయకులు పలు పాఠశాలల,కళాశాలు వద్ద తనిఖీలు చేశారు. ఆ సందర్భంలో కొంత మేర ఆందోళన చేపట్టారు. అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించి మాట్లాడారు. ప్రభుత్వ ఉత్తర్వులు ఉల్లంఘించి అక్రమంగా ప్రత్యేక తరగతులు నిర్వహించారు. ఎం.ఇ.ఒ, ఆర్.ఐ.ఓ తెలిసీతెలియనట్టు వ్యవహరిస్తున్నారని అన్నారు. సెలవు రోజుల్లో తరగతులు నిర్వహించే విద్యాసంస్థలపై అధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఇప్పటికే పలు మార్లు అధికారుల దష్టికి తీసుకొని వెళ్లిన ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆమె చెప్పారు. విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోకపోతే మండల విద్యా కేంద్రాన్ని ముట్టడి చేయడాన్ని తెలియజేశారు. పరిష్కారం కోసం జిల్లా అధికారులను ఫోన్ ద్వారా సమస్యను వివరించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కంచికచర్ల మండల అధ్యక్షుడు మాధవ్ పాల్గొన్నారు.



కళాశాల నుండి బయటకు వస్తున్న విద్యార్థులు

సమస్యలపై గాంధీ విగ్రహానికి వినతి

ప్రజాశక్తి - మైలవరం : సమగ్ర శిక్ష కెజిబివిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ పార్ట్ టైం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం స్థానిక గాంధీ గ్రంథాలయంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా డేటా ఎంట్రీ ఆపరేటర్స్ యూనియన్ రాష్ట్ర నాయకులు సిహెచ్ సాయి రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని సమస్యలను పరిష్కరించే పరిస్థితిలో ప్రభుత్వం లేదని అన్నారు. కేజీబీవీలో పనిచేస్తున్న అన్ని విభాగాల ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని హెచ్ఆర్ఎ, ప్లస్ డిఎలు అమలు చేయాలని పార్ట్ టైం విధానాన్ని రద్దుచేసి ఫుల్‌టైం కాంట్రాక్టు విధానాన్ని అమలు చేయాలని పదవి విరమణ వయసును 62 ఏళ్లకు పెంచాలని మెరుగైన హెల్త్ స్కీములు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ జెఎసి నాయకురాలు సరిత రాణి, ఎ.జమలయ్య, సిఆర్‌పి రాము, సిహెచ్.సుమ, ప్రసన్న వి.శ్రీదేవి, సిఐటియు మండల కార్యదర్శి సిహెచ్.సుధాకర్, న్యాయవాది రమేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.



గాంధీ విగ్రహం వద్ద ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

రైతు భరోసా కేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ మండలంలోని లింగాలపాడు గ్రామంలో ఎంజీఎంఆర్జిఎస్ నిధులు రూ.21.80 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన రైతు భరోసా కేంద్రం భవనాన్ని నందిగామ శాసనసభ్యులు మొండితోక జగన్ మోహన్‌రావు ప్రారంభించారు. అనంతరం ఎం ఐ ఎన్ ఆర్ జి ఎస్, ఎస్‌డిఎఫ్ నిధులు రూ.9.00 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా నిర్మించిన గ్రామ సంత (హార్ట్) కాంప్లెక్స్‌ను శాసనమండలి సభ్యులు మొండితోక అరుణ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్ మోహన్ రెడ్డి నాలుగేళ్లలోనే గ్రామీణ ఆంధ్రప్రదేశ్‌కు కొత్త శోభను తీసుకువచ్చారని తెలిపారు. త్వరలోనే లింగాలపాడు గ్రామంలో మరిన్ని అభివద్ధి పనులు చేసేందుకు ప్రణాళిక రూపొందించామని చెప్పారు. నియోజకవర్గంలోని 70 శాతం గ్రామాల్లో కళ్లెదుటే గ్రామ సచివాలయం కళకళలాడుతున్న స్కూలు భవనాలు ఓవైపు.. రైతుల సేవకు వెలిసిన రైతు భరోసా కేంద్రం మరోవైపు.. ఆపద వేళ ఆదుకోవడానికి సిద్ధంగా ఉన్న హెల్త్ క్లినిక్ ఇంకోవైపు.. అక్కడినుండి నాలుగు అడుగులు ముందుకేస్తే డిజిటల్ లైబ్రరీ, పాల సేకరణ కేంద్రం అని తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పాల్గొన్నారు.



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న వైఎస్ఆర్ విగ్రహం

విగ్రహ ఏర్పాటు స్థలంపై అసంతృప్తి

ప్రజాశక్తి - వన్‌టౌన్ : పశ్చిమ నియోజక వర్గంలోని 42వ డివిజన్ భవానీపురం శివాలయం సెంటర్‌లో ప్రమాదకరమైన మలుపు వద్ద నూతనంగా భారీ వైఎస్ఆర్ విగ్రహం ఏర్పాటు చేశారు. నాలుగు రోడ్ల కూడలి కావటమే గాక, రోడ్డును టర్న్ తీసుకునే మలుపు మార్గం కావటం, డివైడర్‌ను పగులకొట్టి ఆ ప్రదేశంలో వైఎస్ఆర్ విగ్రహం నెలకొల్పటంతో ప్రమాదాల బారిన పడాల్సి వస్తుందని వాహనదారులు, స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భవానీపురం చర్చి సెంటర్ నుంచి స్వాతి సెంటర్ వరకూ గల క్రాంబ్వే రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. మరీ ముఖ్యంగా భవానీపురం శివాలయం సెంటర్ ప్రాంతం నాలుగు రోడ్లు కూడలి కావటమే గాక నగరపాలక సంస్థ అధికారులు రోడ్డు నిర్మించి మధ్యలో డివైడర్ నిర్మించారు. నగరపాలక సంస్థ అధికారుల కొలతల మేరకు శివాలయం సెంటర్‌లో వాహనాలు టర్న్ తీసుకుని స్వాతి సెంటర్‌కు వెళ్లే విధంగా డివైడర్ నిర్మించారు. మరి అలాంటి డివైడర్ ముందు రోడ్డును ఆక్రమించి వాహనాలకు ఇబ్బంది కలిగే విధంగా వైఎస్ఆర్ భారీ విగ్రహం ఏర్పాటుచేయటం వల్ల నిత్యం ప్రమాదలు జరిగే ఆస్కారం ఉందని వాహనదారులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.



సామినేనిని సన్మానిస్తున్న దృశ్యం

సామినేనికి సన్మానం

జగ్గయ్యపేట: పట్టణంలోని ఉదయభాను స్వగహంలో జగ్గయ్యపేట మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా మానేపల్లి బ్రహ్మంని రాష్ట్ర ప్రభుత్వ విప్ సామినేని ఉదయభాను నియమించిన సందర్భంగా సోమవారం మార్కెట్ యార్డ్ చైర్మన్, కమిటీ సభ్యులు రాష్ట్ర ప్రభుత్వ విప్, జగ్గయ్యపేట శాసనసభ్యులు సామినేని ఉదయ భాను ఆయన సతీమణి శ్రీమతి సామి నేని విమలభాను లను మర్యాద పూర్వకంగా కలిసి కతజ్ఞతలు సెల్ఫీ ఘనంగా సన్మానించారు.

రాయల్ లాజిస్టిక్స్ 4వ వార్షికోత్సవ వేడుకలు

జగ్గయ్యపేట: రాయల్ లాజిస్టిక్స్ లారీ ట్రాన్స్ పోర్ట్ సంస్థ 4వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కోదాడ రోడ్డు లో గల ఏ ఎస్ ఆర్ కాంప్లెక్స్ లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాయల్ లాజిస్టిక్స్ ట్రాన్స్ పోర్ట్ నిర్వాహకులు చుండూరు సుభాకర్ మరియు వల్లపునేని గోవిందరావు ల ఆధ్వర్యంలో ముందుగా మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రేయస్సు పరిధిలోని 50 మంది పిల్లలతో కలిసి కేకు కట్ చేయించి, డ్రై ఫ్రూట్స్, గిఫ్ట్ ప్యాక్ లు, భోజనాలను చిన్నారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వ్యాపారవేత్త చౌడవరపు జగదీష్, ప్రముఖ న్యాయవాది పసుపులేటి సత్య శ్రీనివాస్, శశిధర్, గాదె సాయి, బజార్ సాయి, షేక్ నాగుల్ మీరా, వల్లపునేని వెంకటేశ్వరరావు, శ్రీనివాస రావు, శ్రేయస్సు సంస్థ ప్రతినిధులు, ఫైనాన్స్ సంస్థ ప్రతినిధులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

మహాత్ముని అడుగు జాడల్లో పయనించాలి

- జయంతి వేడుకల్లో ప్రముఖులు
- పోటీల్లో విజేతలకు బహుమతులు ప్రదానం



విజేతలకు బహుమతులు అందిస్తున్న దృశ్యం


గాంధీజికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : గాంధీ మహాత్ముని అడుగుజాడల్లో విద్యార్థులు పయనించి భావి భారతదేశాన్ని ఆయన కలలకు అనుగుణంగా రూపొందించుకోవాలని పలువురు ప్రముఖులు పిలుపునిచ్చారు. నగరంలోని సిద్ధార్థ ఆడిటోరియంలో సోమవరం మహాత్మా గాంధీ 154వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ జస్టిస్ భవాని ప్రసాద్ మాట్లాడుతూ గాంధీ అనుసరించిన సత్యం, అహింస పాటిస్తూ ప్రతి పనిలోనూ తమదైన ప్రత్యేకతను నిరూపించుకోవాలని అన్నారు. సామాన్యుడైన గాంధీ అసమాన్యుడుగా ఎదిగి రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని తరిమికొట్టిన తీరును వివరిం చారు. ముందుగా ఆంధ్రప్రదేశ్ గాంధీ స్మారక నిధి కార్యదర్శి వై.రామచంద్ర రావు అతిథులను ఆహ్వానించారు. రఘుపతి రాఘవ రాజారామ్ ప్రార్ధన గీతం అనంతరం గాంధీ విగ్రహానికి అతిథులంతా ఖద్దరు మాలలను వేసి నివాళులర్పించారు. ఉపాధ్యక్షుడు చక్రపాణి స్వాగ తోపన్యాసం చేశారు. ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు డాక్టర్ గాంధీ పిసి కాజా, మాజీ మేయర్ జంధ్యాల శంకర్ మాట్లాడుతూ విజయవాడలో కేఎల్ రావు నేతృత్వంలో గాంధీ హిల్‌ను ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి సరిహద్దు గాంధీ ఖాన్‌అబ్దుల్ అబ్దుల్ గఫూర్ ఖాన్ విచ్చేశారని, అప్పట్లో గాంధీపై సౌండ్ అండ్ లైట్ కార్యక్రమాన్ని ప్రముఖ సినీ రంగనటులు ఎన్టీ రామారావు, కొంగర జగ్గయ్య తదితరుల వ్యాఖ్యానంతో ఏర్పాటయ్యాయని గుర్తుచేశారు. జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు లక్ష్మారెడ్డి, ప్రముఖ వైద్యులు డాక్టర్ సమరం, మాజీ ఎలక్షన్ కమిషనర్ రమేష్ కుమార్ మాట్లాడారు. అనంతరం వివిధ కళాశాలలు, పాఠశాలల్లో నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్, సింగింగ్, క్విజ్ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. ఈ సంవత్సరం గాంధీ స్మారక నిధి ఆధ్వర్యాన పిల్లల్లో చదివే అలవాటుతోపాటు గాంధీ గురించి తెలుసుకోవాలని ఉద్దేశంతో గాంధీ ప్రవేశిక అనే పరీక్షను పైలెట్ ప్రాజెక్టుగా శ్రీ చిగురుపాటి కష్ణవేణి టాలెంట్ స్కూల్లో నిర్వహించారు. ఈ పరీక్షలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, మెమెంటోలు అందజేశారు. సభకు డాక్టర్ రావి శారద సమన్వయకర్తగా వ్యవహరించగా, రశ్మి సమరం వందన సమర్పణ చేశారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం



ప్రజాశక్తి-చల్లపల్లి : సమాజంలో పారిశుద్ధ్య కార్మికులు లేనిదే ప్రజారోగ్యం లేదని ఎస్సీ,ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు దేవరపల్లి సురేష్ బాబు అన్నారు. స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా చల్లపల్లి మండలం కొత్త మాజేరు గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులకు అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ అంటువ్యాధుల నుండి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ, గ్రామాలను, పరిశు భ్రంగా ఉంచడానికి అహర్నిశలు శ్రమించే పారిశుధ్య కార్మికులు అసలైన ప్రజా సేవకులని కొనియాడారు. భారత ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ భారత్ కార్యక్రమానికి కార్మికులు బ్రాండ్ అంబాసిడర్ లాంటి వారని పేర్కొన్నారు. అసోసియేషన్ నాయకులు మద్దాల వెంకటేశ్వ రరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి బి వి సుబ్బారావు, స్థానికులు గుంటూరు ప్రశాంత్,పి. గోపాల్, డి. స్వర్ణలత పాల్గొన్నారు.

సిమెంట్ రోడ్డు నిర్మాణం


రోడ్డు నిర్మాణం చేపడుతున్న దృశ్యం

ప్రజాశక్తి-పమిడి ముక్కల : వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రజలకు సంక్షేమ పాలన అందిస్తోందని చోరగుడి ఎంపీ టీసీ సభ్యులు మర్రి దుర్గా రావు అన్నారు. సోమ వారం పమిడి ముక్కలు మండలంలోని కారగుడి శివారు గోపాల కృష్ణా పురంలో బాబుజగజ్జీవన్ రావు విగ్రహం నుండి రామా లయం వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివద్ధి కట్టుబడి ఉన్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మాతంగి ప్రవీణ్, సచివాలయ కన్వీనర్ కనుమూరి నాగరాజు, పెద్దల గోవిందపల్లి రంగారావు తదితరులు పాల్గొన్నారు.

దేశ ఐక్యత కోసం గాంధీ కృషి : సిపిఎం



మాట్లాడుతున్న ఆర్. రఘు

ప్రజాశక్తి-చల్లపల్లి. దేశ స్వాతంత్ర్యం కోసం 25 సంవత్సరాలు పాటు పోరాడిన మహెూన్నత వ్యక్తి మహాత్మా గాంధీ అని సిపిఎం జిల్లా నాయకులు ఆర్.రఘు అన్నారు.రాజ్యాంగ పరిరక్షణ వేదిక అధ్యర్యంలో సోమవారం గాంధీ జయంతి సందర్భంగా స్థానిక రైస్ మిల్లర్స్ అసోసియేషన్ హాలులో యుద్దనపూడి మధు అధ్యక్షతనగాంధీ ఆలోచనలు -నేటి అవస్యకతపై సదస్సు జరిగింది.ఈసదస్సులో పాల్గొన్న రఘు మాట్లాడుతూ దేశ్ ఐక్యత కోసం గాంధీ కషి చేశారన్నారు. దేశము నుండి విదేశీయులను పరద్రోలెందుకు లౌకికవాదులందరినీ ఐక్యపరచి అహింసా మార్గంలో దేశానికి స్వాతంత్రం సాధించారన్నారు. దేశంలో అస్పృశ్యత,అంటరానితనం నిర్మూలనకు బాటలు వేశారన్నారు. రాజ్యాంగ రచన బాధ్యులుగా అంబేద్కర్ను సూచించారు అన్నారు. పార్లమెంటులో మహాత్ముని మరణానికి కాయకుడైన గాడ్సే విగ్రహ ఏర్పాటుకు ప్రణాళికలు తయారు చేయడం బాధాకరమన్నారు. గాంధీ చరిత్రను ఈ తరం వారికి తెలియకుండా చేసేందుకే ఇలాంటి ప్రయత్నాలు జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. నేటి తరం నాయకులు గాంధీ గురించి తెలుసుకుని ఆయన అడుగుజాడల్లో నడవాలని సూచించారు. తొలుతగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. **పెనమలూరు :** యనమలకుదురు శేషమాంబ ఆశ్రమం వద్ద ఉన్న మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలేసి నివాళిఅర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి కృష్ణా జిల్లా కార్యదర్శి కాశీం మాట్లాడుతూ మహాత్మా గాంధీ ఆశయాల ఆలోచన నేటి నేటి యువతరం పాటించాల్సిన అవసరం ఉందన్నారు. ఆనాడు బ్రిటిష్ వాళ్ళు విభజించి పాలించడం కోసం పెట్టినటువంటి చిచ్చు ఈనాటికి చల్లారకుండా ఈనాటి మతోన్వాద పాలకులు రాజ్యాంగాన్ని ఉల్లంఘిస్తూ కులాలు, మతాల మధ్య చిచ్చుపెడుతున్నారన్నారు. వాళ్ల స్వార్థ రాజకీయాలకు ప్రజలను విభజించి పాలిస్తున్న టువంటి పరిస్థితులు దాపురించాయన్నారు. ఈ కార్యక్రమంలో మత్స్యకార సంఘం నాయకుడు వాటపల్లి శ్రీరాములు, బిసి సెల్ నాయకులు కోసూరు నరేష్, పాస్టర్ బాబురావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) :** జాతిపిత మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని, "ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయిస్ యూనియన్ మచిలీపట్నం డివిజన్ ఆధ్వర్యంలో స్థానిక భాస్కరపురం నందు గాంధీ విగ్రహం. వద్ద జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ డాక్టర్ జి. సుధాకర్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా మహాత్మా గాంధీ విగ్రహానికి ఐసిఇయు నాయకులు, ఎల్ ఐ సి బ్రాంచి-1, బ్రాంచి-2 మరియు ఎ డివిజనల్ ఆఫీస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్ బాబు మాట్లాడుతూ, మహాత్మా గాంధీ ఆశ యాలను, ప్రాధాన్యతను సోదాహరణంగా వివరించారు. ఆయన నాయకత్వం వహించిన అనేక పోరాటాలను, ఉద్యమాలను, వాటి స్ఫూర్తిని గురించి విశదీకరించారు. భారతదేశానికి స్వాతంత్ర్యం ఎ సిద్ధించడానికి సత్యం, అహింస అనే ఆయుధాలతో పోరాటాన్ని సాగించారని పేర్కొన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నాయకులు ఎస్. ధనుంజయరావు మాట్లాడుతూ, గ్రామ స్వరాజ్యం, ఖాదీ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, విదేశీ వస్త్ర భహిష్కరణ వంటి అనేక పిలుపులతో యావత్ దేశాన్ని జాగతం చేసిన దార్శనికుడు మహాత్మా గాంధీ అని కొనియాడారు. ఐసిఇయు ప్రధాన కార్యదర్శి జి. కిషోర్ కుమార్ మాట్లాడుతూ.వ్యాపార సంస్థలలో ఖాతాదారుని యొక్క ఔనత్యాన్ని గురించి గాంధీ పేర్కొన్నట్టుగా, ప్రతి పాలసీదారుడు ఎల్ ఐ సి కి ముఖ్యమని, వారికి మరింత మెరుగైన సేవలు అందించడానికి పునరంకిత మవుతామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిఇయు నాయకులు జె. సుధాకర్, టి. చంద్రపాల్, ఎల్. రాజ శేఖర్ వి.ఆర్.ఎన్. ఠాగూర్, ఎస్.వి. రత్నారావు, బిహెచ్, మాధుర్, ఎస్.కె. సుభాన్, పి. నాగయ్య పాల్గొన్నారు.


యనమలకుదురులో గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు


శ్రమదానంలో పాల్గొన్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ

కోర్టు ప్రాంగణంలో స్వచ్ఛతా దివస్

ప్రజాశక్తి-కలక్టరేట్(కృష్ణా) : హైకోర్టు ఆదేశాల మేరకు సోమవారం జిల్లా కోర్టు ప్రాంగణంలో స్వచ్ఛత దివస్ ని పాటిం చారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి అరుణ సారిక అద్వర్యం లో న్యాయమూర్తులు, కోర్ట్ సిబ్బంది, న్యాయ వాదులు ఈ కార్యక్రమంలో పాల్గొని కోర్ట్ పరిసరాలను శుభ్రం చేశారు.

సజ్జల వ్యాఖ్యలు సరికాదు : సిపిఎం

ప్రజాశక్తి-గన్నవరం : ప్రభుత్వ సలహాదారు రామకృష్ణారెడ్డి కమ్యూనిస్టులపై తప్పుడు వ్యాఖ్యలు చేయడం తగదని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు కళ్ళం వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. సోమవారం గన్నవరం అట్లూరి శ్రమన్నారాయణ మీటింగ్ హాలులో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల కోసం నిరంతరం ఉద్యమిస్తోంది కమ్యూనిస్టు లేనని, అటు వంటి పార్టీపై సజ్జల రూపాయలు వసూలు చేస్తున్నారని వ్యాఖ్యానిం చడం దుర్మార్గం అన్నారు. కమ్యూనిస్టులను కొనగలిగే సత్తా ఈ భూమి మీద ఎవరికి లేదన్నారు.ఈ కార్యక్ర మంలో మిరప నాగేశ్వరరావు, సురగాని సాంబశివరావు,బెజవాడ తాతబ్బాయి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపట్ల అప్రమత్తత అవసరం : సర్పంచ్

ప్రజాశక్తి-మోపిదేవి : సీజనల్ వ్యాధుల పట్ల గ్రామస్తులు జాగ్రత్తగా ఉండాలని సర్పంచ్ గరికిపాటి వెంకటేశ్వరరావు (బుల్లి) అన్నారు. మోపిదేవి మండల పరిధిలోని నాగాయతిప్ప గ్రామ పంచాయితీ పరిధిలో సోమవారం సాయంత్రం దోమల నివారణకు ఫాగింగ్‌ను వెంకటేశ్వరరావు ప్రారంభించారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వెంకటేశ్వరరావు సూచించారు. పంచాయతీ కార్యదర్శి ఉప్పాల వెంకటేశ్వరరావు పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ పీతా మహేష్, ఎన్ఆర్ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్ విశ్వనాథపల్లి కిరణ్ కుమార్ పాల్గొన్నారు.



గుంతలు పూడ్చాలని నిరసన

ప్రజాశక్తి-గుడివాడ : స్థానిక న్యూ బైపాస్‌రోడ్డులో ప్రమాద భరితంగా ఉన్న భారీ గుంతలను పూడ్చాలంటూ జనసేన నాయకుడు జనసేన నాయకుడు ఎం. రామకృష్ణ (ఆర్.కె.) వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. ఆర్.కె. వారియర్స్ సభ్యులకు కలిసి ప్ల కార్డులు చేతబూని రోడ్డు మధ్యలో ఉన్న భారీ గుంతల్లో కూర్చుని ఆర్.కె. రోడ్లకు తక్షణం మరమ్మతులు చేయాలంటూ నినాదాలు చేశారు. అత్యంత ప్రమాద భరితంగా బైపాస్ రోడ్డులో గుంతలు ఏర్పడటంతో, ప్రమాదాలు జరిగి వాహనదారులు గాయపడుతున్న అధికారులు స్పందించక పోవడం దారుణమని ఆర్.కె. ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత శాఖల అధికారులు స్పందించి చర్యలు చేపట్టకుంటే కలెక్టరేట్ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహిస్తామని ఆర్.కె. హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో ఆర్.కె.వారియర్స్ సభ్యులు అయ్యప్ప, చరణ్, తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి కోసం ధర్నా

ప్రజాశక్తి- నందిగామ : పట్టణ శివారు అనాసాగరం గ్రామంలో ప్రతి రోజూ మంచినీరు సరఫరా చేయాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో సోమవారం రోడ్డుపై నిలబడి ధర్నా చేశారు. నెలరోజుల ఒకసారి మంచినీళ్లు ఇస్తున్నారని గ్రామస్తులు నిరసన తెలిపారు. అనాసాగరంలో ప్రతి రోజూ మంచినీళ్లు ఇవ్వాలని నినాదాలు చేశారు. సిపిఎం నందిగామ పట్టణ నాయకులు కరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలకు నెలరోజులకు ఒకసారి మంచినీళ్లు ఇస్తున్నారని, దీంతో మినరల్ వాటర్‌ను ఆశ్రయించాల్సి వస్తోందని అన్నారు. ఈకార్యక్రమంలో సిపిఎం నందిగామ పట్టణ కార్యదర్శి కటారపు గోపాల్, పట్టణ నాయకులు సయ్యద్ ఖాసిం, ప్రజాసంఘాల నాయకులు హుస్సేన్, కరి సాంబయ్య, కరి నాగేశ్వరరావు, కరి బుడ్డి, డి.లక్ష్మణ్, పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

జర్నలిస్టుల నిరసన

ప్రజాశక్తి - యంత్రాంగం : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం జిల్లాలో పలుచోట్ల జర్నలిస్టులు ఆందోళనలు నిర్వహించారు. మైలవరం, జగ్గయ్యపేట, వీరులపాడుల్లో నిరసన తెలిపారు. జగ్గయ్యపేట ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యాన 'సేవ్ జర్నలిజం డే' కార్యక్రమం నిర్వహించారు. జగ్గయ్యపేటలో మహాత్ముని విగ్రహానికి నూలు దండలు వేసి నివాళులర్పించారు. అనంతరం గాంధీ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. వీరులపాడు మండల ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యాన 'సేవ్ జర్నలిజం డే' కార్యక్రమం మండల కేంద్రమైన జుజ్జురులో నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించి గాంధీ విగ్రహానికి, తహశీల్దారు కార్యాలయంలో వినతిపత్రాలు సమర్పించారు. ఎపియుడబ్ల్యుజె ఆధ్వర్యాన మైలవరం పంచాయతీ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి గాంధీ, పొట్టి శ్రీరాములు విగ్రహాలకు, ఎంఎల్‌కు, తహశీల్దార్ ముత్యాల శ్రీనివాస్‌కు వినతిపత్రాలు అందజేశారు.

నగర పరిశుభ్రతకు ప్రజల సహకారం అవసరం

'స్వచ్ఛత హి సేవ' ముగింపులో కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : ఎన్నో లక్షలు వెచ్చించి, సుందరంగా తీర్చిదిద్దిన పార్కుల నిర్వహణపై బాధ్యతగా వ్యవహరించాలని, అన్ని వేళలా జాగ్రత వహించాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. నగర పరిశుభ్రతకు ప్రజల సహకారం కూడా ఎంతో అవసరమన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ ఆధ్వర్యాన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పార్క్‌లో సోమవారం 'స్వచ్ఛత హి సేవ' ముగింపు కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ బందరు కాల్వ వెంబడి పున: ప్రారంభించిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ పార్క్‌ను ఎంతో ఆకర్షణీయంగా తీర్చిదిద్ది, ప్రజలకు అందుబాటులో తీసుకువచ్చిన నగరపాలక సంస్థ పాలకవర్గం, అధికార యంత్రాంగానికి అభినందనలు తెలిపారు. సందర్శకులు కూడా పార్క్‌లో ఏర్పాటు చేసిన పరికరాలకు ఎటువంటి నష్టం కలగ చేయకుండా సక్రమంగా వినియోగించుకోవాలన్నారు. ఎంఎల్‌ఎ మల్లాది విష్ణువర్ధన్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులు, ప్రజలను భాగస్వాములను చేసి నగరాన్ని పరిశుభ్రంగా తీర్చిదిద్దిన కమిషనర్‌కు అభినందనలు తెలిపారు. అనంతరం స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో విశిష్ట సేవలు అందించిన శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, పారిశుధ్య, క్లాప్, సచివాలయ సిబ్బందిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. అలాగే సోషల్ మీడియా ద్వారా నిర్వహించిన పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన వారికీ బహుమతులను అందించారు. పారిశుధ్య సిబ్బందికి రైన్ కోట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, వైసిపి తూర్పు నియోజకవర్గ ఇన్చార్జి దేవినేని అవినాష్, కార్పొరేటర్, ఎపిఐడిసి చైర్మన్ బండి నాగేంద్ర పుణ్యశీల, డిప్యూటీ మేయర్లు బెలం దుర్గ, అవుతు శ్రీశైలజా రెడ్డి,



విఎంసి సిబ్బందిని సత్కరిస్తున్న కలెక్టర్ డిల్లీరావు, కమిషనర్ దినకర్, దేవినేని అవినాష్, అవుతు శ్రీ శైలజారెడ్డి, బెల్లం దుర

కార్పొరేటర్లు తాడిపర్తి కొండారెడ్డి, పి.నరసకుమారి, అదనపు కమిషనర్ (జనరల్) పి.శకుంతల, అదనపు కమిషనర్ (ప్రాజెక్టు) కె.వి.సత్యవతి, చీఫ్ ఇంజినీర్ ఎం.ప్రభాకరరావు, డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) వెంకటలక్ష్మి, ఎస్టేట్ ఆఫీసర్ శ్రీనివాస్, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రత్నావళి తదితరులు పాల్గొన్నారు.

మహాత్ముడిని స్మరించుకోవాలి : కలెక్టర్

ప్రజాశక్తి - వన్‌టౌన్ : అహింసా పద్ధతిలో మహాత్మా గాంధీ నడిపిన శాంతియుత పోరాటాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని మాజీమంత్రి, విజయవాడ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావు, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు, విఎంసి కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. మహాత్ముని ఆశయాలకు అనుగుణంగా నేటి యువత ముందుకు నడవాలని ఆకాంక్షించారు. జాతిపిత మహాత్మా గాంధీ 154వ జయంతిని పురస్కరించుకొని సోమవారం నగరపాలక సంస్థ ఆధ్వర్యాన వన్‌టౌన్ బిఆర్‌పి రోడ్ గాంధీ పార్క్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు పాల్గొని మహాత్మాగాంధీ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా కలెక్టర్ ఢిల్లీ రావు మాట్లాడుతూ గాంధీజీ కలలు కన్న సమాజాన్ని నిర్మించడానికి ప్రతి ఒక్కరు కషి చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయాల వ్యవస్థ ద్వారా పాలనను ప్రజలకు మరింత చేరువ చేసిందన్నారు. ఈకార్యక్రమంలో అదనపు కమిషనర్ (జనరల్) శకుంతల, చీఫ్ మెడికల్ ఆఫీసర్ డా.రత్నావళి పాల్గొన్నారు.



మహిళా చైతన్యమే సమాజాభివృద్ధికి పునాది

ప్రజాశక్తి - విజయవాడ : జనాభాలో సగభాగంగా ఉన్న మహిళలు కేవలం ఇంటికే పరిమితం కాకుండా సామాజిక, రాజకీయ, ఆర్థిక రంగాల్లో ముందుండడం ద్వారానే సమాజాభివద్ధి సాధ్యమవుతుందని ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక జాతీయ అధ్యక్షులు, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కోట వెంకటేశ్వర రెడ్డి అన్నారు. గాంధీ జయంతి సందర్భంగా ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక, జన విజ్ఞాన వేదిక సాంస్కృతిక విభాగం సౌజన్యంతో కోట ఝాన్సీ రాణి కళావేదిక, స్థానిక తెలుగు కళావాహిని, జిఆర్‌కె పోలాలవరపు సాంస్కృతిక సమితి, శ్రీ కళాభారతి సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం "ఆకాశంలో సగం, అవనిలో సగం' అంశంపై కార్యక్రమం నిర్వహించారు. గాంధీనగర్ శ్రీ హనుమంతరాయ గ్రంథాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో వెంకటేశ్వరరెడ్డి మాట్లాడుతూ మహిళా రిజర్వేషన్ బిల్లును స్వాగతిస్తున్నామని అన్నారు. ఈ బిల్లులో పరిమితులు, విమర్శలు ఉన్నాయని, వీటిపై ప్రజల్లో చర్చ జరగాల్సి ఉందన్నారు. తెలుగు కళావాహిని అధ్యక్షులు చింతకాయల చిట్టిబాబు మాట్లాడుతూ మహిళలు చైతన్యంగా ఉండాలని, వారిని మేలుకొలపాలని తెలుగులో అనేక సినిమాలు నాటిక, నాటికాలు ఎన్నో వచ్చాయని, అవి కొంత మార్పుకు శ్రీకారం చుట్టాయని అన్నారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కోశాధికారి రాజశేఖర్ రాహుల్ మాట్లాడుతూ అభ్యుదయ భావాలు కలిగిన సంస్థలు, వామపక్ష భావాలు కలిగిన ఎందరో ఆందోళనలు, పోరాటాలు చేయడం వలనే ఈనాటికి మహిళా రిజర్వేషన్ బిల్లు చట్ట రూపం దాల్చిందన్నారు. ఈసందర్భంగా మహిళలను అభినందించి సత్కరించారు. అనంతరం మహిళా ప్రాధాన్యత గల గేయాలతో సంగీతభావారి జరిగింది. ఈ కార్యక్రమంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు రమేష్, జి మురళీధర్ రాజు రాంప్రసాద్, డేవిడ్ రాజ్, వెంకట్, అబ్రహం, దానియేలు, మస్తాన్ వలి పావని ,వడ్డాది కామేశ్వరి షబానా, దుర్గ, నాగమణి, మాధవి, అమలాపురం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



"ఆకాశంలో సగం, అవనిలో సగం' కార్యక్రమంలో నేతలు

టిడిపి దీక్షకు అడ్డంకులు

ప్రజాశక్తి - భవానీపురం, విజయవాడ అర్బన్ : 'సత్యమేవ జయతే' పేరుతో 'సత్యమేవ జయతే' పేరుతో ఎన్‌టిఆర్ జిల్లాలో సోమవారం టిడిపి ఆధ్వర్యాన దీక్షలు చేపట్టారు. తూర్పు నియోకజవర్గ ఎమ్మెల్యే గద్దె రామమోహన్ ఆధ్వర్యంలో అశోక్‌నగర్ కార్యాలయం దగ్గర సత్యమేయ జయతే పేరుతో నిరసన దీక్ష చేపట్టారు. గొల్లపూడిలోని మాజీ మంత్రి దేవినేని ఉమా కార్యాలయం వద్ద సోమవారం టిడిపి చేపట్టిన దీక్షకు అనుమతి లేదంటూ పోలీసులు అడ్డంకులు సృష్టించారు. టిడిపి నాయకులు పద్మశేఖర్, నర్రా క్రాంతిని అరెస్టుచేసి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. చంద్రబాబును అరెస్టు చేసినప్పటి నుండి గొల్లపూడిలోని ఉమా కార్యాలయం ఎదురుగా గల ఖాళీ స్థలంలో టెంట్ వేసుకుని ప్రతిరోజూ టిడిపి శ్రేణులు నిరసన ప్రదర్శనలు చేస్తున్నారు. ఈనేపథ్యంలో సోమవారం భవానీపురం పోలీసులు ఆ ప్రాంతంలో నిరసన చేయటానికి వీలు లేదంటూ గోడకు నోటీసు అంటించారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలో సెక్షన్ 144 సిఆర్‌పిసి, సెక్షన్ 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ముందస్తు అనుమతి తీసుకోవాలని నోటీసులు పేర్కొన్నారు. ఏ విధమైన ర్యాలీలు. ప్రదర్శనలు చేయకూడదని, సంబంధిత స్థల యజమాని అనుమతించకూడదని నోటీసు అంటించారు. ఆ స్థలంలో కాకుండా పార్టీ కార్యాలయంలో చేసుకోవాలని పోలీసులు అడ్డుకున్నారు. దీంతో టిడిపి నాయకులు ప్ల కార్డులు చేతబట్టి నిరసన చేపట్టారు. ఈ నిరసనలో గొల్లపూడి మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్, టిడిపి నాయకులు గోపాలకృష్ణ, గ్రామ పార్టీ అధ్యక్షుడు నర్రా వాసు, గొల్లపూడి గ్రామ మాజీ సర్పంచ్ వెంకటేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు. పశ్చిమ ఎసిపితో సహా గొల్లపూడి ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద పోలీసులు గట్టి బందోబస్తు నిర్వహించారు.



అశోక్‌నగర్ కార్యాలయం వద్ద దీక్షల్లో గద్దె రామ్మోహన్, అనురాధా

మొదటిపేజీ తరువాయి

స్వాతంత్ర్య సమరంలో బందరుకు ప్రత్యేక స్థానం

మాజీ మంత్రి కొల్లు రవీంద్ర, పార్టీ కృష్ణాజిల్లా అధ్యక్షులు, మాజీ ఎంపి కొనకళ్ల నారాయణ తదితరులు టిడిపి బ్యానర్లను ఏర్పాటు చేశారు.

కుల సమీకరణలతో అభివృద్ధి సాధ్యం కాదు

కుల సమీకరణాల గురించి ఆలోచిస్తే ఎప్పటికీ అభివద్ధి సాధ్యం కాదని జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. మచిలీపట్నంలోని సువర్ణ కళ్యాణ మండపంలోని నిర్వహించిన జనసేన పార్టీ జిల్లా విస్తతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏదో ఒక రోజున దేశమంతా జనసేన పార్టీ భావజాలమే వ్యాప్తి చెందుతుందన్నారు. ఈ మాట తాను చాలా ధైర్యంగా చెబుతానన్నారు. ఏ ఒక కులం కారణంగా అధికారం రాదని గుర్తించాలన్నారు. తాను కాపు సామాజిక వర్గానికి చెందినవాడినని మొహమాటం లేకుండా చెప్పుకోగలనన్నారు. కానీ ఒక్క కాపు ఓటు బ్యాంకునే దష్టిలో ఉంచుకుంటే గెలవడం సాధ్యమయ్యే పనికాదన్నారు. కులం గురించి ఆలోచించేవాడు కుల నాయకుడవుతాడే తప్ప, దేశ క్షేమాన్ని కాంక్షించే దేశ నాయకుడు కాలేడన్నారు. తాను అన్నింటినీ సమదష్టితో చూసే వ్యక్తినన్నారు. తాను కులాలను వెదుక్కొని స్నేహాలు చేయనని చెప్పారు. కులాల ఐక్యత గురించి తాను మొత్తుకుంటున్నానని చెప్పారు. వైసిపిలో కీలక పదవులన్నీ ఒక కులంతో నింపేస్తే అభివద్ధి ఎలా సాధ్యమని ప్రశ్నించారు. కాపులు అత్యధిక సంఖ్యలో ఉన్నారని, వారు పెద్దన్న పాత్ర పోషించాలని అన్నారు. ఒక కులానికి మరో కులం పట్ల ఎందుకు ద్వేషం ఉండాలని ప్రశ్నించారు. సామాజిక వెనుకబాటును ఎలా రూపుమాపాలో అందరూ ఆలోచించాలన్నారు. తన ఎత్తు, రంగు.. వీటిని మనం ఎలా సొంతంగా నిర్దేశించుకోలేమో, కులం కూడా అంతేనన్నారు. మాతభాష నుంచి తప్పించుకోలేం, మతాన్నుండి తప్పించుకోలేమని, అవి జన్మతః వచ్చేస్తాయని చెప్పారు. వీటన్నింటిని దష్టిలో ఉంచుకుని జనసేన పార్టీ చాలా విశాల దకృథంతో ఆలోచిస్తోందని చెప్పారు. 2008 నుంచి చూస్తున్నా... ఎన్నికలు ఎప్పుడు వచ్చినా కులాల వారీగా సమాజాన్ని విడగొట్టే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇది సహజమేనని, కానీ కులాల వల్ల అభివద్ధి అయితే ఎప్పటికీ జరగదని అన్నారు. బందరు పోర్టుకు ముగ్గురు ముఖ్యమంత్రులు శంకుస్థాపన చేశారని, కులాలు, మతాలు దాటి వెళితేనే ఎక్కడైనా అభివద్ధి జరుగుతుందన్నారు. దుబాయ్ వంటి అరబ్ ఎమిరేట్స్ దేశాల్లో రెండింట మూడు వంతుల మంది భారతీయులే ఉంటారని, అక్కడి ఆర్థిక వ్యవస్థలకు వెన్నెముకగా ఉన్నారని చెప్పారు. భారతీయుల శ్రమశక్తి కూడా దుబాయ్ వంటి దేశాల అభివద్ధిలో కీలకపాత్ర పోషిస్తోందన్నారు. బిఎస్‌పినే తీసుకుంటే... ఐదారు ఎన్నికలు... అంటే 20 ఏళ్లు ఆ పార్టీ కష్టపడితేనే మాయావతి ముఖ్యమంత్రి అయ్యారని చెప్పారు. పార్టీ పెట్టగానే ముఖ్యమంత్రి అయిపోవాలనే అవివేకం కానీ, అంత పిచ్చి ఆలోచన కానీ తనకు లేదన్నారు. 80వ దశకంలో అప్పటి పరిస్థితుల్లో ఎన్టీ రామారావు పార్టీ పెట్టిన వెంటనే గెలిచారని, అందరికీ అలా జరగదని అన్నారు. వైసిపిపై వ్యక్తిగతం ద్వేషం లేదని, చిన్నప్పటి నుంచి జగన్‌ని చూస్తున్నానని చెప్పారు. టీనేజ్‌లో ఎస్ఐని కొట్టిన ఘటన చూశానని, అందుకే జగన్ రాష్ట్రానికి సరికాదని మద్దతు ఇవ్వలేదని అన్నారు. లోతైన దష్టితోనే రాజకీయాలను చూడాలని, నైతిక బలం ఉంటే ఎవరిపైనైనా పోరాటం చేయగలమని అన్నారు. వెన్నుపోటు పొడిచేవాడు ఎప్పుడూ మనలోనే ఉంటాడన్నారు. ఈ సమావేశంలో పార్టీ ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షులు బండ్రెడ్డి రామకృష్ణ, మచిలీపట్నం నియోజకవర్గ ఇన్చార్జి బండి రామకృష్ణ, పలువురు జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

గాంధీ పేరుతో రాజ్యమేలుతున్న గాడ్సే వారసులు

యంత్రాల రాక వల్ల చేతి వత్తులు, కుటీర పరిశ్రమలు అంతరించి పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేగాక వ్యవసాయ రంగం సంక్షోభాన్ని, ఆటుపోట్లను ఎదుర్కొంటూ, రైతులు ఆత్మహత్యలు చేసుకోవాల్సిన దుస్థితికి నెట్టబడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాల వల్ల విదేశీ విష సంస్కృతి విలయ తాండవం చేస్తోందని విమర్శించారు. వీటన్నింటికీ వ్యతిరేకంగా అభ్యుదయ, లౌకిక, ప్రజాతంత్ర వాదులు ఉద్యమించాలని పిలుపునిచ్చారు. చరిత్ర విశ్లేషకులు మొవ్వా శ్రీనివాసరెడ్డి, సర్వోదయ ట్రస్ట్ కార్యదర్శి మోతుకూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం పాటుపడిన వారిలో గాంధీ, నెహ్రూ, అంబేద్కర్‌తోపాటు కమ్యూనిస్టుల త్యాగాలను కూడా మరువలేమని అన్నారున. వారి ఆశయాలకు ఈనాటి యువత నడుంబిగించాలని కోరారు. నేడు పాలకులు అనుసరిస్తున్న విధానాల వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ అత్యంత దారుణంగా కుంటుపడిందని ఆందోళన వ్యక్తం చేశారు. చివరిగా పాఠశాల చిన్నారులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు జ్ఞాపికలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు వేమూరు బాబురావు, గాంధీ వేషధారి నాగరాజన్, ఎంబివికె బాధ్యులు టి.క్రాంతికిరణ్, ప్రముఖ రచయిత గుమ్మా సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కెవిపిఎస్ ఆవిర్భావ దినోత్సవం


మచిలీపట్నంలో...

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం 25వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం కృష్ణా జిల్లా కేంద్రం ప్రజా సంఘాల కార్యాలయంలో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు సిహెచ్ రాజేష్ మాట్లాడుతూ పోరాటాలు, విజయాలను ఆదర్శంగా తీసుకుని భవిష్యత్తులో దళితుల అభివద్ధికి మరెన్నో ఉద్యమాలను నిర్మిద్దాం అని పిలుపు నిచ్చారు.మనువాద మతోన్మాదులకు వ్యతిరేకంగా ఐక్య ఉద్యమాలు చేద్దాం అన్నారు. రాజ్యాంగం, ప్రభుత్వ రంగ సంస్థలు, రిజర్వేషన్లు, ఎస్సి, ఎస్ టి అత్యాచార నిరోధక చట్టం , సబ్ ప్లాన్ చట్టాలను కాపాడుకుందాం అన్నారు. సమాజాభివద్ధికి తరతరాల నుండి శ్రమను ధారపోస్తున్న దళితులు నేటికీ అమానుషమైన అంటరానితనం, కులవివక్ష, అత్యాచారాలు, అణిచివేతలు, సాంఘీక బహిష్కరణలు, శిరోముండనాలకు గురవుతూనే ఉన్నరాన్నారు.. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు కొడాలి శర్మ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాల వెంకటేశ్వ రరావు, కౌలు సంఘం జిల్లా నాయకులు శివ నాగేందర్ రావు, సిఐటి యు జిల్లా నాయకులు ఆర్‌సిపి రెడ్డి బూరా సుబ్రహ్మణ్యం, బి రాజేష్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు శీలం ప్రకాష్ రావు, కుల వివక్ష వ్యతి రేక పోరాట సంఘం మచిలీ పట్నం అధ్యక్షులు మిరియాల ఆనంద్ బెనర్జీ, ఎల్‌ఐసి నాయకులు టీ చంద్రపాల్, ఏవోఐ నాయకులు రాజారావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-గన్నవరం :** దళితుల సమస్యలపై పోరాటం చేయడమే కాకుండా వారికి అండగా నిలిచేది కెవిపిఎస్ అని ఆ సంఘం జిల్లా నాయకులు కైలే ఏసుదాసు పేర్కొన్నారు. సోమవారం గన్నవరం మండలం ముస్తాబాద్ గ్రామంలో కే వి పి ఎస్ జెండాను కళ్ళం రాంబాబు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏసుదాసు మాట్లాడుతూ కేవీపీఎస్ చేస్తున్న పోరాటాల వల్ల దళితుల సమస్యలు చాలావరకు పరిష్కారం జరిగినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కళ్ళం కోటయ్య, నాగరాజు పాల్గొన్నారు. అదేవిధంగా చనిపోయి వారి గూడెం, గన్నవరం దళితవాడలో కెవిపిఎస్ జెండాలను ఆవిష్కరించారు. ఆ సంఘం నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, కే వెంకటేశ్వ రరావు, మిరప నాగేశ్వరరావు, తిరువీధి రవి, బెజవాడ తాతబ్బాయి పాల్గొన్నారు. **ప్రజాశక్తి ఉయ్యూరు :** సమాజంలో సాంఘిక అసమానతలను నిరోధించ డానికి ఏర్పడినదే కుల వివక్షత పోరాట సంఘం అని కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి నెమ్మాది గోపాల్ అన్నారు. సోమవారం బోళ్ళపాడు గ్రామంలో 25వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కెవిపిఎస్ జెండాను ఎగురవేశారు. నేటికీ కొన్ని గ్రామాలలో కుల వివక్ష కొనసాగుతుందని దానిని రూపుమాపే దిశలో ఏవిపిఎస్ తరఫున పోరాటాలు ఉదతం చేస్తామని ఆ దిశలో కెవిపిఎస్ ప్రయాణిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పవన్ కుమార్ సిఐటియు నాయకులు బి రాజేష్ కెవిపిఎస్ నాయకులు తిరుపతయ్య చిన్న కుమారి వెంకాయమ్మ వాణి గొల్లపల్లి కుమారి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.


ఉయ్యూరులో...


గన్నవరంలో...

జాతిపిత గాంధీకి ఘన నివాళి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : అహింసా మార్గం ద్వారా దేశానికి స్వాతంత్ర సముపార్జన చేసిన జాతిపిత మహాత్మా గాంధీ జీవితం ప్రతీ ఒక్కరికీ ఆదర్శనీయమని జిల్లా రెవెన్యూ అధికారి పి. వెంకటరమణ అన్నారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జాతిపిత మహాత్మా గాంధీ 154 వ జయంతి సందర్భంగా గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డిఆర్ఓ మాట్లా డుతూ సత్యం, అహింస అనే ఆయుధాలతో మహాత్మాగాంధీ రవి అస్తమించని బ్రిటీష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించారని, దేశానికి స్వాతంత్ర్యం కోసం అలుపెరగని కృషి చేశారన్నారు. ఇన్చార్జి ఆర్డీవో సి. శివ నారాయణరెడ్డి, కలెక్టరేట్ పరిపాలనాధికారి రాధిక, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అలాగే ప్రతి ఒక్కరు నడవాలని, హింసా మార్గాన్ని వీడి ఆహింస మార్గములో మంచి పరివర్తనతో మెలగాలని జిల్లా లీగల్ ఎయిడ్ ఆథారిటి సెక్రటరీ కె వి రామ కష్ణయ్య సూచించారు. గాంధీ జయంతి, ఖైదీల సంక్షేమ దినోత్సవం మచిలీపట్నం, స్పెషల్ సబ్ జైల్ లో జిల్లా లీగల్ ఎయిడ్ ఆథారిటి సెక్రటరీ కె వి రామ కష్ణయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జైలు ఆవారణలో 'స్వచ్ఛ భారత్ దివస్' ను పురస్కరించుకుని పండ్ల మొక్కలను నాటారు. జిల్లా బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ టి..హరి బాబు, లీగల్ ఎయిడ్ డిఫెన్సు కౌన్సిల్ అడ్వకేట్ చీలి మునలయ్య, జైల్ విసిటింగ్ డాక్టర్ వై బాల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. **ప్రజాశక్తి మచిలీపట్నం రూరల్ :** అహింసా మార్గంలో పోరాటం చేసి దేశానికి స్వాతంత్ర్యం తీసుకునిరావడం ద్వారా గాంధీజీ ఖ్యాతి గడించారని కృష్ణా విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డాక్టర్ బ్రహ్మచారి కొనియాడారు. గాంధీజీ జయంతి సందర్భంగా సోమవారం కృష్ణా విశ్వవిద్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సంస్థ జనరల్ మేనేజర్ జయంత్ సింఘ్ సీన్హా స్వచ్ఛత సపథ కార్యక్రమం నిర్వహించారు. బిఈఎల్ సిబ్బంది, అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి పెదపారుపూడి :** పెదపారుపూడి మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మ గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి జయంతి సందర్భంగా వారి చిత్రపటాలకు ఎండిఓ రామకష్ణ పూలమాల వేసి నివాళిఅర్పించారు. ఈవో పి ఆర్ డి వి శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ బేగం పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** చల్లపల్లి పంచాయతీ కార్యాలయంలో గాంధీ జయంతి వేడుకలు సందర్భంగా పారిశుద్ధ కార్మికులను సన్మానించారు. గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సర్పంచ్ పైడిపాములకష్ణకుమారి, ఈవో పేరుని మాధవేంద్రరావు, సిఐటియు మండల కార్యదర్శి మహ్మద్ కరీముల్లా పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. **ప్రజాశక్తి, గుడ్లవల్లేరు :** స్థానిక గ్రామ పంచాయతీలో మండల పరిషత్ అధ్యక్షులు కొడాలి సురేష్ ఆధ్వర్యంలో ర్యాలీ, ప్రతిజ్ఞ నిర్వహించారు. మండల ఎంపీడీవో దారపు శ్రీనివాస్ పంచాయతీ కార్యదర్శులు ఎజెఎల్ నరసింహారావు, ఎలీషారావు, విజయబాబు మరియు సచివాలయ ,పంచాయితీ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే స్థానిక ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో స్థానిక బస్టాండ్ పైన గల గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళు లర్పించారు. కంతేటి సుబ్బారావు, వాసవి క్లబ్ అధ్యక్షురాలు కొల్లిపర అనసూయ పార్థసారథి పాల్గొ న్నారు. అలాగే స్థానిక శ్రీ సాయి విద్యా నికేతన్ లో విద్యార్థులకు మహాత్మా గాంధీ గురించి ప్రిన్సిపాల్ సింగంశెట్టి ఆదినారాయణ వివరించారు. **ప్రజాశక్తి-గన్నవరం :** మండల పరిధిలోని ముస్తాబాద్ గ్రామంలోని నవభారత్ హై స్కూల్ నందు గాంధీ విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. పాఠశాల కరస్పాండెంట్ షేక్ ఇమామ్, విద్యార్థులు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి మోపిదేవి :** మోపిదేవి మండల పరిధిలోని కోసూరువారిపాలెంలో జాతిపిత మహాత్మా గాంధీజీ జయంతి కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద పంచాయతీ సర్పంచ్ కోసూరు అనూష అధ్యక్షతన గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు సనకా వెంకట రాజేష్ బాబు, గ్రామ సచివాలయాల మండల కన్వీనర్ కోసూరు శివనాగమల్లేశ్వరరావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-అవనిగడ్డ** ఎమ్మెల్యే రమేష్ బాబు కార్యాలయం వద్ద గాంధీ, లాల్ బహుదూర్ శాస్త్రి చిత్రపటాలకు పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఫైర్ స్టేషన్ వద్ద గల జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. దివి మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ కొక్కిలిగడ్డ వీర వెంకటేశ్వరరావు ఎంపీపీ తుంగల సమితి దేవి, జడ్పిటిసి చింతలపూడి లక్ష్మీనారాయణ, పార్టీ నియోజకవర్గ అధికార ప్రతినిధి సింహాద్రి వెంకటేశ్వం రావు, గాంధీ క్షేత్రంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఉపసభాపతి మండలి బుద్ధ ప్రసాద్ గాంధీ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. గాంధీ క్షేత్ర కమిటీ ప్రధాన కార్యదర్శి మతి శ్రీనివాసరావు, గ్రామీణ యువజన వికాసం అధ్యక్షులు మండలి వెంకట్ రామ్, మాజీ జిల్లా పరిషత్ చైర్మన్ గొర్రెపాటి రామకష్ణ పాల్గొన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఫైర్ స్టేషన్ వద్ద గల గాంధీ విగ్రహానికి మండల పార్టీ అధ్యక్షులు దిడ్ల వీర రాఘవులు నరహరిశెట్టి శ్రీమన్నారాయణ పూలదండలు వేసి నివాళులర్పించారు. అలాగే జనసేన పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో గాంధీ చిత్రపటానికి మండల పార్టీ అధ్యక్షులు గుడివాడ శేషుబాబు పూలదండలు వేసి నివాళులర్పించారు.


కలెక్టరేట్‌లో...


అవనిగడ్డలో...


సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎంఎల్ఎ కైలే అనిల్‌కుమార్

గడపగడపకూ మన ప్రభుత్వం

ప్రజాశక్తి పెదపారుపూడి : అర్హత ఉంటే తమ ప్రభుత్వంలో సంక్షేమం పథకాలు ఇంటి వద్దకే వస్తాయని ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ అన్నారు. సోమవారం పెదపారుపూడి గ్రామంలో సోమవారం గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. అధికా రులు ప్రజాప్రతినిధులతో కలసి ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ అందించిన సంక్షేమం పథకాలు వివరించి బుక్లెట్లు అందించారు. పలు సమస్యలను మహిళలు ఎమ్మెల్యే కు తెలియజేశారు. ఎంపీపీ గోగం సురేష్ ,గ్రామ సర్పంచ్ అప్పికట్ల ఆశాజ్యోతి ,ఎంపీటీసీలు చదలవాడ పద్మజ ,జాజుల శ్రీనివాసరావు, గ్రామ పార్టీ కన్వీనర్ మండవ జానకి రామయ్య (మున్నా) పాల్గొన్నారు

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి-ఘంటసాల : ఘంటసాల గ్రామంలోని శ్మశాన వాటికలో పేకాట ఆడుతున్నట్లు ఎస్ఐ శ్రీని వాసుకు అందిన సమా చారంతో పోలీసు సిబ్బం దితో కలిసి పేకాట స్థావరం పై దాడి చేశారు. ఈ సందర్భంగా ఎస్సై కుడిపూడి శ్రీనివాసు మాట్లాడుతూ ఈ దాడిలో పేకాట ఆడుతున్న ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేయడంతో పాటు రూ.1,590ల నగదును స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఘంటసాల పోలీసు స్టేషన్ పరిధిలో పేకాట, కోడిపందాలు, జూదాలు, చిత్తులాటలు, ఆడేవారి పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.


సాయం అందిస్తున్న శ్యామ్ కిషోర్

అగ్ని ప్రమాద బాధితులకు సాయం

ప్రజాశక్తి-అవనిగడ్డ : మండల పరిధిలోని మోదుమూడి గ్రామంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో మెరుగు సీతామహాలక్ష్మి గృహం దగ్ధమైంది. విషయం తెలుసుకున్న శ్యామ్ కిషోర్ నాయుడు సోమవారం ఆమె కుటుంబ వద్దకు వెళ్లి వారిని పరామర్శించి నూతనంగా గృహ నిర్మాణం చేసుకుంటున్న సీతామహాలక్ష్మికి శ్రీరామ వెల్ఫేర్ సొసైటీ నిర్వాహకులు తోట శ్యామ్ కిషోర్‌నాయుడు రూ.5 వేల ఆర్థిక సహాయం అంద జేశారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ విలియం కేరి, ఇజ్రాయిల్ పాల్గొన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

ప్రజాశక్తి-గుడివాడ : వాసవి క్లబ్ కపుల్స్ గుడివాడ ఆధ్వర్యంలో స్థానిక మార్కెట్ సెంటర్‌లో గల గాంధీ మండపం నందు ఉన్న మహాత్మా గాంధీ, మాజీ ప్రధానమంత్రి భారతరత్న లాల్ బహుదూర్ శాస్త్రి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మాజీ అధ్యక్షులు కారుమూరి సాయి దిలీప్ కుమార్ సహకారంతో ఐదుగురు నిరుపేద మహిళలకు పింఛన్ నిమిత్తం నిత్యావసర సరుకులు పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో శేగు బబిత, రీజియన్ ఇంచార్జ్ గాదె మోహన్ బాబు, జోన్ చైర్ పర్సన్ బచ్చు జగన్ వెంకట మురళీకష్ణ పాల్గొన్నారు. వాసవి క్లబ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా వాసవి క్లబ్ కపుల్స్ ఆధ్వర్యంలో పూర్వపు గవర్నర్ తాతా రజిని కుమారి ని ఘనంగా సత్కరించారు.

వైసిపిలో భగ్గుమన్న విబేధాలు

- బిల్లుల విషయంలో ఎంపిటిసి X ఎంపిపి
- మాటామటా పెరిగి బాహాబాహీకి దిగిన ప్రజాప్రతినిధులు
- పోలీసుల రంగ ప్రవేశంతో సద్దుమణిగిన వివాదం

ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల మండలం పెండ్యాల గ్రామంలో అధికార పార్టీకి చెందిన ఇద్దరు ప్రజా ప్రతినిధులు మధ్య తలెత్తిన ఆర్థిక లావాదేవీలు వివాదం ఘర్షణ దారి తీసి ఇరువురు బాహాబాహీకి దిగటంతో విబేధాలు భగ్గుమన్నాయి. సోమవారం గ్రామం లో బహిరంగంగా విబేధాలు బైటపడి ఒకరికొకరు బాహాబాహీకి దిగారు దీంతో గ్రామంలో ఉద్రిక్తత పరిస్థితి ఏర్పడటంతో పోలీసులు రంగ ప్రవేశం చేశాక పరిస్థితి సద్దుమణిగింది. కంచికచర్ల మండలంలో ఇప్పటికి వైసిపి వర్గ విభేదాలు తారస్థాయికి చేరగా మండల పరిషత్ అధ్యక్షుని వ్యవహారంతో వ్యవహారం పతాక స్థాయికి చేరుకుంది. టిడిపి ఆవిర్భావం నుండి కంచుకోటలో ఉన్న పెండ్యాల గత ఎన్నికలలో వైఎస్సార్సీపీకి పట్టం కట్టింది. ఈ గ్రామానికి చెందిన మలక్ బషీర్ ను కంచికచర్ల మండల పరిషత్ అధ్యక్షుడిగా ఎంపిక చేసి గెలిపించుకుంది. బషీర్ ఎక్కువ కాలం హైదరాబాదులో ఉన్నందున మండలంలో చాలామందికి పరిచయం లేనప్పటికీ పార్టీ పేరుతో పదవిని నెట్టుకొస్తున్నాడు గతంలో ఒకసారి సొంత పార్టీ నేతలతోనే గొడవ పడటంతో పోలీసులు దాకా వెళ్ళింది కాగా పెండ్యాల లో మండల పరిషత్ జనరల్ ఫండ్స్ నుండి మరో వైసీపీ ఎంపిటిసి షేక్ బడే హజరత్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఏరియా లో ఆరు లక్షల నిధులు రోడ్ల నిర్మాణానికి మంజూరు చేశారు అయితే ఇతనికి జీఎస్టీ లేకపోవడంతో ఎంపిపి బంధువుల పేరుతో పనులు పూర్తి చేశారు. అయితే అతనికి ఇంతవరకు బిల్లు రాకపోవడంతో మండల పరిషత్ అధికారులను అడగగా ఎంపీపీ పేరుతో ఈ ఏడాది మేలోనే ఎంపీపీ పేరుతో జమ అయినట్లు చెప్పారు దీనిపై సదరు నేత సోమవారం పెండ్యాలలో ఎంపీపీని గత మేలోనే బిల్లు వస్తే తనకెందుకు డబ్బులు ఇవ్వలేదని నిలదీయడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది ఈ వాగ్వాదం కాస్త చేతులు కలుపుకునే స్థాయికి చేరింది ఒకే పార్టీలో ఉన్న ఇద్దరు నాయకులు బహిరంగంగా కొట్లాట వరకు రావడంతో గ్రామస్తులు వింతగా చెప్పుకుంటున్నారు ఎంపీపీ బషీర్ పదవి చేపట్టిన దగ్గర నుండి పలు వివాదాలలో ఇరుకోవడంతో మండలంలో ఇతనిపై సర్వత్ర వ్యతిరేకత వ్యక్తం అవుతుంది మలక్ బషీర్ ఎంపిపి పదవి చేపట్టినప్పటి నుండి మండల పరిషత్ కార్యాలయాన్ని ప్రైవేటు సెంటిమెంట్ లకు అడ్డంగా మార్చాడని అధికార పార్టీ నాయకులే చెబుతున్నారు. ఏడాది క్రితం మండల పరిషత్ కార్యాలయంలో అదే గ్రామానికి చెందిన వ్యక్తి తో భూ ఆర్థిక లావాదేవీల సెంటిమెంట్ చేస్తూ, ఎంపిప డబ్బులు డిమాండ్ చేశాడని, ఆ సమయంలో ఇద్దరి మధ్య మాటా మాటా పెరిగి, బాధితుని పై ఎంపిపి దాడి చేశాడు. దీంతో బాధితుడు విజయవాడ సిపి ని ఆశ్రయించాడు. సిపీ ఆదేశాల మేరకు విచారణ చేసిన స్థానిక పోలీసులు ఎంపిపి పై కేసు కూడా నమోదు చేశారు. అంతకు ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు సమక్షంలోనే ఎంపిపి బషీర్, కీసర గ్రామానికి చెందిన ఓ నాయకుడు తో ఘర్షణ పడ్డారు. ఇ సమయం లో ఇద్దరి మధ్య ఘర్షణ తలెత్తింది. ఇలా ఎంపిపి తరచూ వివాదాలకు కేంద్ర బిందువు కావటంతో, ఎంపిపి వ్యవహార శైలి నియోజకవర్గం అధినాయకులక తలనొప్పిగా మారి తలల పట్టుకుంటున్నట్లు అధికార పార్టీ నాయకులే అంటున్నారు.



నేటి నుండి 'సూత్రా' ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: బెంజిసర్కిల్ వద్ద గల శేషసాయి కళ్యాణ మండపంలో ఈ నెల 3, 4 తేదీలలో సూత్రా ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నట్లు నిర్వాహకులు కె.మూర్తి తెలిపారు. ఈసందర్భంగా శేషసాయి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎగ్జిబిషన్ వివరాలను తెలిపారు. రానున్న దసరా పండుగ సందర్భంగా అద్భుతమైన గొప్ప డిజైనర్స్‌ను పరిచయం చేయాలనే ఉద్దేశంతోనే ఈఎగ్జిబిషన్‌ను నిర్వహిసుతన్నామని తెలిపారు. రెండు రోజుల పాటు జరిగే ఈఎగ్జిబిషన్ ఉదయం 10 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ఉంటుందన్నారు. ఈప్రదర్శనకు ఎటువంటి ప్రవేశ రుసుము లేదని ఉచితమని తెలిపారు. ఇక్కడే వేల రకాల దుస్తులు, సౌందర్య సాధనాలు, సౌందర్య ఉత్పత్తులు, గృహ అలంకరణ సామాగ్రి, గిఫ్ట్ ఐటెమ్స్, ఉంటాయన్నారు. డిజైనర్ వస్త్రాలు ఈప్రదర్శనలో ప్రత్యేకంగా ఏర్పాటుచేస్తున్నట్లు తెలిపారు.

లక్కీడ్రా విజేతలకు బహుమతులు

ప్రజాశక్తి-గన్నవరం: గన్నవరం డిపో పరిధిలోని ఆర్టీసీ ప్రయాణీకులకు లక్కీ డ్రా స్కీం ఏర్పాటు చేయడమైదని డిపో మేనేజర్ శివాజీ సోమవారం తెలిపారు. రూట్ నెం: 252 (కాళ్లేశ్వరావు మార్కెట్ - హనుమాన్ జంక్షన్ వయా ఏలూరు రోడ్) మరియు రూట్ నెం: 252బి (కాళ్లేశ్వరరావు మార్కెట్ - హనుమాన్ జంక్షన్ వయా బందర్ రోడ్)లలో ఈ స్కీం అమలు చేయబడునని చెప్పారు. ప్రయాణీకులు బస్సు దిగేటప్పుడు వారి టిక్కెట్ వెనుక పేరు, ఫోన్ నెంబర్ వ్రాసి బస్సులో ఏర్పాటు చేసిన గిఫ్ట్ స్కీం బాక్స్ లో వేయవలెనని అన్నారు.. ప్రతి 15 రోజులకు ఒకసారి డ్రా తీసి ఒక్కొక్క రూట్ కు ఇద్దరికి బహుమతులు అందజేస్తామని తెలిపారు. ప్రయాణికులు ఈ సదవకాశమును సద్విని యోగం చేసుకుని ఆర్టీసీ బస్సులలోనే ప్రయాణం చేయాలని కోరారు.



బంగారు గొలుసు బహూకరణ

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఇంద్రకీలాద్రి దుర్గమ్మ దేవాలయానికి పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు చెల్లెలు పి.పద్మావతి, నాగశ్రీనివాస్ దంపతులు అమ్మవారి అలంకారం నిమిత్తం 156 గ్రాముల బరువు గల బంగారు చైన్‌ను, సూత్రాలను ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్ కర్నాటి రాంబాబుకి దేవస్థానానికి విరాళంగా అందజేశారు. అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం అందజేశారు.

టెన్‌పిన్ బౌలింగ్ పోటీల్లో రన్నరప్‌గా సుమతి

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: బెంగళూరులో సెప్టెంబరు 25 నుంచి 30 వరకు జరిగిన 32వ నేషనల్ టెన్‌పిన్ బౌలింగ్ ఛాంపియన్‌షిప్



(టిబిఎస్ఐ)కు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఒక మహిళ సహా ఎనిమిది మంది క్రీడాకారులు పాల్గొన్నారు. వీరిలో నగరానికి చెందిన సుమతి నల్లబంటు టెన్‌పిన్ బౌలింగ్‌లో నాకౌట్ గేమ్‌లో 25 పిన్స్ తేడాతో రన్నరప్‌గా రెండో స్థానంలో నిలిచారు. పురుషుల విభాగంలో కర్ణాటకకు చెందిన కిషన్.ఆర్. విజేతగా నిలవగా, ఆకాష్ అశోక్‌కుమార్ రన్నరప్‌గా నిలిచారు. అలాగే తమిళనాడుకు చెందిన సబీనా అత్తిక విన్నర్‌గా నిలిచారు. ఈ సందర్భంగా విజేతలను కర్ణాటక క్రీడల శాఖ మంత్రి బి.నాగేంద్ర, కర్ణాటక ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.గోవిందరాజ్‌లు మెమొంటోలు అందజేసి అభినందించారు.



కుట్టుమిషన్లు పంపిణీ

ప్రజాశక్తి-వన్‌టౌన్

గొలగాని ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈ బీసీ పేద మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. సోమవారం చిట్టినగర్ విశ్వబ్రాహ్మణ కళ్యాణమండపంలో గొలగాని ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ ఎన్నారై గొలగాని రవికష్ణ తమ గొలగాని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కుట్టు మిషన్ల పంపిణీ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు అడ్డూరి శ్రీరామ్, మైనార్టీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు షేక్ బాజీ , రాష్ట్ర మీడియా ఇన్ ఇంచార్జ్ నాగభూషణం, రాష్ట్ర యువ మోర్చా అధ్యక్షులు మిట్ట వంశీ తదితరులు పాల్గొన్నారు.

యువత కోసం సోనీ ఇయర్ బడ్స్

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్

సోనీ నుండి అత్యాధునిక డబ్ల్యుఎస్ -1000 ఎక్స్ ఎం వైర్‌లెస్ ఇయర్ బడ్స్‌ను మార్కెట్లోకి యువత కోసం తీసుకువచ్చినట్లు సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ తెలిపారు. ఎం.జి.రోడ్డులోని సోనీ సెంటర్ నందు ఉత్పత్తుల పరిచయ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన స్థాయి నైపుణ్యాన్ని జోడించి అత్యాధునికంగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. అసమానమైన వాయిస్ , మెరుగైన రీతిలో సౌండ్ ఎక్స్‌పీరియన్స్, ఉంటాయని తెలిపారు. ట్యూన్‌లకు సౌకర్యవంతంగా ఉండేందుకు కంపెనీ అన్ని జాగ్రతత్తలు తీసుకుంటదని తెలిపారు. సంగీతంలో ప్రతి ఒక్కరినీ లీనమయ్యే విధంగా ఇయర్ బడ్స్‌ను అందిస్తున్నామని తెలిపారు.

ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు : ఉదయభాను

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: రాష్ట్రంలో ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు అందించిన ఏకైక ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అని ప్రభుత్వవిప్ సామినేని ఉదయభాను అన్నారు. పట్టణంలోని 9వ సచివాలయం 21వ వార్డు బుక్క వారి వీధి, ఆకుల వారి వీధి,ఆలాస పూరి వారి వీధి నందు రాష్ట్ర ప్రభుత్వవిప్, జగ్గయ్యపేట నియోజకవర్గ శాసనసభ్యులు సామినేని ఉదయభాను గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించి సంక్షేమ పథకాలతో కూడిన బ్రోచర్ ను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉదయభాను మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అభివృద్ధి, సంక్షేమ రెండు కళ్లుగా పాలన సాగిస్తున్నారని అని కొనియాడారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు పెంటి శ్రీనివాస్, దుర్గగుడి డైరెక్టర్ అల్లూరి భాస్కర్, తిరుమలగిరి దేవస్థానం చైర్మన్ సుబ్రమణ్యం, వార్డు నాయకులు అలసపూరి సత్యనారాయణ, అలసపురి వెంకటేశ్వరరావు, తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఉదయభాను

వైసిపి నాయకులు చిట్టిబాబుకు నివాళి

ప్రజాశక్తి-గంపలగూడెం

వైసిపి సీనియర్ నాయకులు కొత్త గుండ్ల వెంకటమూర్తి (చిట్టిబాబు)కు పలువురు ఘనంగా నివాళులర్పించారు. మండల కేంద్రమైన గంపలగూడెం పట్టణ ఆర్యవైశ్య ప్రముఖులైన చిట్టిబాబు (72) సోమవారం మృతిచెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు. గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ తుది శ్వాస విడిచారు. చిట్టిబాబు కాంగ్రెస్‌లో ఎంపిటిసిగా, పిఎసిఎస్ చైర్మన్‌గా, మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా, ఎల్ఐసి ఏజెంట్‌గా కొనసాగి ప్రజలకు సేవలందించారు. ఆయన మృతదేహాన్ని తిరువూరు ఎమ్మెల్యే కొక్కిలిగడ్డ రక్షణనిధి, ఆర్యవైశ్య ప్రముఖులు, వైసిపి నాయకులు సందర్శించి ఘనంగా నివాళు లర్పించారు.



వెలంపల్లికి సత్కారం

ప్రజాశక్తి-భవానీపురం: స్థానిక భవానిపురంలో గల వైసిపి కార్యాలయంలో మాజీ మంత్రి, పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు వెలంపల్లి శ్రీనివాసరావును పలువురు సత్కరించారు. సోమవారం జరిగిన ఈ సత్కారం మహోత్సవానికి తెలుగు భాషా సంఘం అధ్యక్షులు పి. విజయబాబు, ఆంధ్రప్రదేశ్ ప్రెస్ అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు ముఖ్య అతిథులుగా పాల్గొని వెలంపల్లిని సత్కరించారు. విజయబాబు, శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇటీవల కాలంలో నియోజకవర్గానికి ముఖ్యమంత్రి రావటం ఆ సభను సక్సెస్ చేయడం సంతోషమన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రుహుల్లా, విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ చైర్మన్ తోలేటి శ్రీకాంత్, జైన్ కార్పొరేషన్ చైర్మన్ మనోజ్ కొఠారి, ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ బండి పుణ్యశీల, పిళ్ళా రవి, అల్లంశెట్టి తారకేశ్వరరావు, జిఎంసి భాష, స్టాండింగ్ కమిటీ సభ్యులు గుడివాడ నరేంద్ర, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, డైరెక్టర్లు, పార్టీ అనుబంధ విభాగాల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.



వెలంపల్లిని సత్కరిస్తున్న వైసిపి నాయకులు